విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 3 | సంచిక : 291 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | శనివారం 14 మార్చి 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool


## నిషేధిత జాబితా నుంచి 66,157 ఎకరాల తొలగింపు



- పోలవరం సొరంగాల ప్రవాహ సామర్థ్యం పెంపునకు అదనపు పనులు
- మూడు జిల్లాల్లో కేంద్రీయ విద్యాలయాలకు స్థలాల కేటాయింపు
- మంత్రిమండలి సమావేశంలో నిర్ణయాలు
- వివరాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి

: రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (ఏపీఐఐసీ) పరిశ్రమలకు కేటాయించిన 66,157 ఎకరాలను రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22-ఎ కింద 'నిషేధిత ఆస్తుల జాబితా' నుంచి తొలగించేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. పరిశ్రమల నిర్మాణం పూర్తయ్యాక మరో 3,803 ఎకరాలనూ షరతులతో 22-ఎ జాబితా నుంచి తొలగించేందుకు అనుమతించింది. సుమారు 51,603 ఎకరాల ప్రభుత్వ, ఇతర భూములను నేరుగా ఏపీఐఐసీ

- మిగతా 2లో

## హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ లిసా గిల్

ప్రమాణం చేయించనున్న జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్.

ఏపీ హైకోర్టు తొలి మహిళా ప్రధాన న్యాయ మూర్తిగా చరిత్ర.

- మిగతా 7లో





## ఒమన్‌లో డ్రోన్ దాడి... ఇద్దరు భారతీయులు మృతి

డ్రోన్ దాడి కారణంగా ఒమన్ దేశంలో ఇద్దరు భారతీయులు మృతి చెందారు. ఒమన్‌లోని సోహార్ నగరంలో ఈ దాడి జరిగింది. దాడిలో మరో పదకొండు మందికి గాయాలు అందులో 10 మంది భారతీయులేనని తెలుస్తోంది. ఐదుగురు స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతు న్నట్లు భారత విదేశాంగ శాఖ తెలిపింది. చికిత్స పొందుతున్న వారిలో ఎవరికీ ప్రాణాపాయం

- మిగతా 2లో



## ఆరు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు

ఏ ఎన్నికలైనా మనమే గెలవాలి

ఏప్రిల్ 2న మంత్రులు, కార్యదర్శుల పనితీరుపై నివేదికలు

మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి

మరో ఆరు నెలల్లో స్థానికసంస్థల ఎన్నికలు వస్తాయని, ఏ ఎన్నికలైనా మనమే గెలవాలన్న లక్ష్యంతో పనిచేయాలని మంత్రులకు సీఎం చంద్రబాబు తెలిపారు. ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు

- మిగతా 2లో



## రికార్డు స్థాయిలో రైతుల ఖాతాల్లో డబ్బులు



- 99.75% మందికి ఒకేసారి జమ
- మూడో విడతలో భాగంగా రూ.2,676 కోట్లు
- ఈ ఏడాది రూ.20వేల చొప్పున రూ.8,985 కోట్లిచ్చాం
- వ్యవసాయంలో ఐదు లక్ష్యాలతో ముందుకు సాగుతున్నాం
- 'పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ' సభలో సీఎం చంద్రబాబు



గువాహటిలో ప్రధాని మోదీ, గన్నవ రంలో తాను ఒకేసారి రాష్ట్రంలోని 46.85 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.2,676 కోట్లను జమచేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం వెల్లడించారు. అన్నదాత సుఖీభవ మూడోవిడతలో భాగంగా.. రికార్డుస్థాయిలో 99.75% మంది రైతుల ఖాతాల్లో ఏకకాలంలో డబ్బులు వేశామన్నారు. మిగతా కొద్దిమంది బ్యాంకుఖాతాల్లో సమస్య వల్ల ఆగాయని, శనివారం ఉదయం లోపు వాళ్లకూ వస్తాయని ప్రకటించారు. కృష్ణాజిల్లా గన్నవరం నియోజకవర్గం సూరంపల్లిలో శుక్రవారం నిర్వహించిన 'పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ' కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. సభలో చంద్రబాబు

- మిగతా 2లో



## భారత్ బాధపడితే మేం కూడా బాధపడతాం

### ఇరాన్ రాయబారి ఫతాలీ

భారత్, ఇరాన్ మధ్య ఉన్న సంబంధాలు అత్యంత బలమైనవని, ఉమ్మడి ప్రయోజనాలు, విలువల పునాదిపై ఇవి నిర్మితమయ్యాయని

- మిగతా 2లో



## ఎడతెగని దాడులు

- ఇరాన్‌పై విరుచుకుపడ్డ అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధవిమానాలు
- గల్ఫ్ దేశాలవైకి దూసుకెళ్లిన టెహ్రాన్ క్షిపణులు, డ్రోన్లు
- ఒమన్‌లో డ్రోన్ దాడి.. ఇద్దరు భారతీయుల మృతి
- మరో 10 మందికి గాయాలు
- ఇరాక్‌లో కూలిన అమెరికా రీఫ్యూయెలింగ్ విమానం
- ఆరుగురు సిబ్బంది మృత్యువాత
- ఇరాన్ త్వరలోనే లొంగిపోతుందన్న ట్రంప్

- మిగతా 2లో

## భాజపా వచ్చాకే ఈశాన్యంలో శాంతి

గువాహటి: ఈశాన్య రాష్ట్రాల్లో ఒకప్పుడు బాంబు పేలుళ్లు, తుపాకీ కాల్పుల మోతలు వినిపించేవని, భాజపా-ఎన్డీయే డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు వచ్చాక శాంతి నెలకొందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. శుక్రవారం అస్సాంలో వివిధ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. దాదాపు రూ.24,250 కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించారు. తొలుత కోక్రాఝార్ జిల్లాలో భాజపా ఏర్పాటు చేసిన బహిరంగ సభను ఉద్దేశించి గువాహటి నుంచి వర్చువల్‌గా ప్రసంగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పై మోదీ విరుచుకుపడ్డారు. దశాబ్దాలుగా ఆ పార్టీ ఈశాన్య రాష్ట్రాలను మోసం చేసిందని ఆరోపించారు.

- మిగతా 2లో



## ప్రజల్ని తప్పుదోవ పట్టించేలా జగన్ కుట్రలు



కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్ర అభివృద్ధిని చూసి ఓర్చుకోలేక, ప్రజల్ని తప్పుదోవ పట్టించేలా జగన్ కుట్రలు పన్నుతున్నారని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి యామినీ శర్మ ధ్వజమెత్తారు. జగన్ రాజకీయ ఉనికి కోసమే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారని శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. 'వైకాపా ప్రభుత్వంలో విచ్చలవిడిగా అప్పులు చేశారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ దోచుకుని సర్వనాశనం చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై సొంత స్టిక్కర్లు వేసుకుని క్రెడిట్ చోరీ చేశారు. ప్రస్తుతం దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందుతున్న

- మిగతా 2లో



## అనవసర ఆందోళనతో గ్యాస్ బుక్ చేయొద్దు

సరిపోయే ఎల్‌పీజీ నిల్వలున్నాయి

నెట్‌వర్క్‌లు దగ్గరుంటే 'పీఎన్‌జీ'కి మారండి

ప్రజలకు కేంద్రం విజ్ఞప్తి

దిల్లీ: పశ్చిమాసియా ఘర్షణలతో ఇంధన భయాలు నెలకొన్నవేళ.. దేశంలో ఎల్పీజీ కొరత లేదని కేంద్రప్రభుత్వం పునరుద్ఘాటించింది.

- మిగతా 2లో

# ఆరు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు

-మొదటిపేజీ తరువాయి

ఘనవిజయం సాధించేలా ఇన్‌ఛార్జి మంత్రులు బాధ్యత తీసుకోవాలన్నారు. సీట్ల సర్దుబాటు తదితర అంశాలపై ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తామని తెలిపారు. శుక్రవారం మంత్రివర్గ సమావేశంలో ఎజెండా అంశాలపై చర్చ ముగిశాక మంత్రులతో ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో వివిధ శాఖల మంత్రులు, కార్యదర్శుల పనితీరుపై ఏప్రిల్ 2న కాన్ఫిడెన్షియల్ రిపోర్టులు ఇస్తామని సీఎం చెప్పారు. దస్త్రాల పరిష్కారం, కీలక పనితీరు సూచీలు (కేపీఐ) లక్ష్యాలను చేరుకోవడం, సాధించిన విజయాలు, కేంద్రం నుంచి నిధులు తెచ్చుకోవడం, ఖర్చుచేయడంలో చూపించిన చొరవ లాంటి అంశాల ఆధారంగా నివేదికలు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. ఈ రెండేళ్లలో పరిస్థితులన్నీ ఒక దారికి తేగలిగామని, ఇక అభివృద్ధి ఊపందుకోవాలని, 2026-27 కీలక మైలురాయి కావాలని ఆయన పేర్కొన్నారు. మంత్రులు విరివిగా పర్యటనలు చేసి, సమీక్షలు నిర్వహించాలని సూచించారు.

**చేసింది చెప్పకపోతే ఎలా?**

చాలామంది మంత్రులు తమ శాఖల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, సాధించిన విజయాల గురించి ప్రజలకు సమర్థంగా చెప్పలేకపోతున్నారని, సామాజిక మాధ్యమాల్ని సరిగ్గా వినియోగించుకోవడం లేదని ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. "మీ శాఖల పరిధిలో ఏం చేశామన్నది చెప్పుకోవాలి కదా? వాళ్లు (వైకాపా) చేసిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని ఇప్పటికి కొంత గాడిన పెట్టగలిగాం. ఇక మీరు స్పీడ్ పెంచాలి. మీరు సాంకేతికతను అందిపుచ్చుకుంటేనే మెరుగైన ఫలితాలను సాధించగలం" అని సీఎం తెలిపారు. తెదేపా కార్యాలయం నుంచి పంపించిన సమాచారాన్ని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంలో మంత్రులు వెనకబడుతున్నారని, దీన్ని సరిచేసుకోవాలని మంత్రి లోకేశ్ సూచించారు.

క్యాబినెట్ భేటీలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రులు అచ్చెన్నాయుడు, లోకేశ్, కొల్లు రవీంద్ర, నారాయణ, అధికారులు

**ఏప్రిల్ 2 నుంచి 90 రోజులపాటు జలధార**

ఏప్రిల్ 2 నుంచి 90 రోజులపాటు జలధార కార్యక్రమం నిర్వహించాలని, కాలువలు, డ్రెయిన్లలో పూడిక తొలగించి, చివరి భూములకూ నీరందేలా చేయాలని సీఎం ఆదేశించారు. ముఖ్యమంత్రి చేసిన సూచనలు, ఆదేశాల్లోని ముఖ్యాంశాలు...

రైతులు నారుమళ్లు వేసుకునేందుకు మే 15కి ఎలాగైనా కాలువలకు నీరు విడుదల చేయాలి.

వైకాపా ప్రభుత్వం ఎత్తిపోతల పథకాల్ని నిర్వీర్యం చేయడంతో 6-7 లక్షల ఎకరాలకు నీరందలేదు. వాటన్నింటినీ మళ్లీ రన్నింగ్‌లో పెట్టాలి.

రేపల్లె-అవనిగడ్డ ప్రాంతంలో కొన్నిచోట్ల కృష్ణా కరకట్ట బలహీనపడిందని ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చిన మంత్రి అనగాని సత్యప్రసాద్. కరకట్ట ఎక్కడెక్కడ బలహీనంగా ఉందో గుర్తించి బలోపేతం చేయాలని సీఎం ఆదేశం.

మార్చి 16న అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణ. విగ్రహానికి మంచిపేరు ఆలోచించాలన్న సీఎం. ఆరోజు రాష్ట్రవ్యాప్తంగా పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమాలు. పర్యవేక్షణకు మంత్రులు సవిత, సత్యకుమార్, దుర్గేష్‌లతో కమిటీ.

**వంటగ్యాస్, నిత్యావసరాల కొరత లేకుండా చూడండి**

ప్రపంచం నలుమూలలా తెలుగువారు ఉన్నారు. యుద్ధాల్లాంటి సంక్షోభాలు వచ్చినప్పుడు వారు ఇబ్బంది పడుతున్నారు. వారికి అవసరమైన సహాయం అందించాలి. దీంతోపాటు వంట గ్యాస్, ఇతర నిత్యావసరాలకు కొరత లేకుండా... మంత్రులు కేశవ్, అచ్చెన్నాయుడు, మనోహర్‌లతో వేసిన కమిటీ పర్యవేక్షించాలి.

ఎలక్ట్రిక్ స్టౌల వినియోగం పెరిగినట్టు వార్తలు వస్తున్నాయని మంత్రి కేశవ్ ప్రస్తావించగా... విద్యుత్ వినియోగం పెరుగుతుందేమో చూడాలని, డిమాండ్‌కి తగ్గట్టు ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులకు సీఎం ఆదేశం.

పంచాయతీల్లో పన్ను వసూళ్లు మెరుగుపడ్డాయని, నీటిసంఘాలతో కూడా నీటితీరువా వసూళ్లు చేయించాలని మంత్రి రామానాయుడికి సీఎం సూచన.

# రికార్డు స్థాయిలో రైతుల ఖాతాల్లో డబ్బులు

-మొదటిపేజీ తరువాయి

మాట్లాడుతూ.. రైతు కుటుంబంలో పుట్టిన తనకు వారి కష్టాలు బాగా తెలుసన్నారు. వారికి ఎప్పుడూ అండగా ఉంటానని స్పష్టం చేశారు.

**రాష్ట్రం రూ.14 వేలు.. కేంద్రం రూ.6 వేలు**

ఇప్పటివరకూ మొదటి రెండు విడతల్లో రూ.7వేల చొప్పున రూ.14వేలు, ఇప్పుడు రూ.6వేలతో కలిపి మొత్తం రూ.20వేలను ఒక్కో రైతు ఖాతాలో జమచేసినట్లు చంద్రబాబు చెప్పారు. దీనిలో కేంద్రం రూ.6వేలు, రాష్ట్రం రూ.14వేలను ఇచ్చామన్నారు. ఈ ఏడాది మూడు విడతల్లో కలిపి రూ.8,985 కోట్లను రైతులకు ఇచ్చిన ఏకైక ప్రభుత్వం తమదేనని తెలిపారు.

**వ్యవసాయంలో ఐదు లక్ష్యాలతో ముందుకు**

2047 నాటికి స్వర్ణాంధ్ర సాకారమే లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. 'అప్పటికి దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లవుతుంది. ఆ సమయానికి వ్యవసాయం మరింత కీలకం కాబోతోంది. అందుకే.. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వ మద్దతు.. ఈ ఐదు లక్ష్యాలను నిర్దేశించుకుని వ్యవసాయంలో ముందుకు సాగుతున్నాం. పోలవరాన్ని 72% పూర్తిచేశాక ప్రభుత్వం మారడం శాపంగా మారింది. డయాఫ్రం వాల్ దెబ్బతిన్నా వాళ్లు పట్టించుకోలేదు. ఇప్పుడు మరో డయాఫ్రం వాల్ కోసం రూ.వెయ్యి కోట్లను ఖర్చుచేశాం' అని చంద్రబాబు పేర్కొన్నారు.

గన్నవరం మండలం సూరంపల్లిలో రైతులనుద్దేశించి ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి అచ్చెన్నాయుడు, ఎంపీ బాలశౌరి, విప్ యార్లగడ్డ వెంకట్రావు, కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ తదితరులు

**మే 15 నాటికే నారుమళ్లు**

ఈ ఏడాది రిజర్వాయర్లు, చిన్న చెరువుల్లో 65% నీళ్లు ఖరీఫ్, రబీకి వాడుకున్నా.. ఇంకా నిల్వలు ఉన్నాయంటే ప్రభుత్వ దూరదృష్టే కారణమని చంద్రబాబు పేర్కొన్నారు. 'వచ్చే సీజన్ మే 15కే నారుమళ్లు వేసుకోవాలి. వర్షపు నీటితోనే ఖరీఫ్ పూర్తవ్వాలి. అప్పుడే రిజర్వాయర్లలో నీళ్లు నిండుగా ఉంటాయి. రెండో పంటకు నీళ్లు వాడుకున్నా అన్ని రిజర్వాయర్లలో 75% నీళ్లు ఉండాలనేది లక్ష్యం. అప్పుడే ఎలాంటి ప్రకృతి విపత్తులొచ్చినా నీటికి ఇబ్బంది ఉండదు. భూగర్భజలాలను పెంచడంపైనా దృష్టిపెట్టాం. గత రెండేళ్లలో 1.83 మీటర్లు భూగర్భ జలాలు పెరిగాయి' అని చంద్రబాబు పేర్కొన్నారు.

**అందరూ వరి అంటే దెబ్బతింటాం**

వ్యవసాయంలో ఆధునికీకరణ, సాంకేతిక వినియోగం ఎంత ముఖ్యమో.. డిమాండ్‌కు తగ్గ పంటలను వేయడం కూడా అంతే ప్రధానమని ముఖ్యమంత్రి సూచించారు. 'అందరూ వరినే పండిస్తే ఉపయోగం ఉండదు. ఇప్పుడు వరి తినేవాళ్లు తగ్గుతున్నారు. గుడ్లు, చేపలు, కూరలు, పండ్లు అన్నీ తింటున్నారు. అయినా మొండిగా వరితోనే పోతే దెబ్బతింటాం. తెలివిగా పంటలు వేస్తే ఎన్ని సమస్యలొచ్చినా అధిగమించే శక్తి మనకొస్తుంది' అని చంద్రబాబు సూచించారు.

# ఎడతెగని దాడులు

దుబాయ్, వాషింగ్టన్: పశ్చిమాసియాలో పరిస్థితులు ఎంతమాత్రమూ కుదుటపడట్లేదు. అమెరికా-ఇజ్రాయెల్ దాడులు.. ఇరాన్ ప్రతీకార దాడులతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లుతూనే ఉంది. యుద్ధం 14వ రోజైన శుక్రవారం టెహ్రాన్ సైనిక సామర్థ్యాలను దెబ్బకొట్టడమే లక్ష్యంగా వాషింగ్టన్, టెల్ అవీవ్ యుద్ధవిమానాలతో దాడులు కొనసాగించాయి. ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పై, గల్ఫ్ దేశాలపై క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. ఒమన్‌పై టెహ్రాన్ జరిపిన డ్రోన్ దాడిలో ఇద్దరు భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. మరో 10 మంది గాయపడ్డారు. పశ్చిమ ఇరాక్‌లో అమెరికా రీఫ్యూయెలింగ్ విమానమొకటి కూలిపోవడంతో.. అందులోని ఆరుగురు అమెరికా సిబ్బంది మృత్యువాతపడ్డారు. మరోవైపు- ఇరాన్ త్వరలోనే లొంగిపోతుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జోస్యం చెప్పారు. అమెరికా విమానవాహక నౌక అబ్రహం లింకన్‌పై తాము బాలిస్టిక్ క్షిపణులతో దాడి చేశామని, ప్రస్తుతం అది పనిచేయడం లేదని ఇరాన్ పేర్కొంది. ఆ ప్రకటనను వాషింగ్టన్ తోసిపుచ్చింది. ఇరాన్‌వ్యాప్తంగా సైనిక, ఇతర లక్ష్యాలపై అమెరికా, ఇజ్రాయెల్ శుక్రవారం యుద్ధవిమానాలతో బాంబుల వర్షం కురిపించాయి. యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇరాన్‌లో 15 వేల లక్ష్యాలపై తాము దాడి చేసినట్లు వాషింగ్టన్ తెలిపింది. టెహ్రాన్‌లో భారీ పేలుడు: ఇరాన్ రాజధాని టెహ్రాన్‌ను శుక్రవారం భారీ పేలుడు కుదిపేసింది. 'ఇంటర్నేషనల్ కుద్స్ డే' సందర్భంగా పాలస్తీనియన్లకు మద్దతుగా, ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా.. నగరంలోని ఫిర్దౌసీ స్క్వేర్ ప్రాంతంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపట్టిన వార్షిక ర్యాలీకి వేలమంది హాజరయ్యారు. వారిని లక్ష్యంగా చేసుకొని దాడి జరిగింది. ఈ ఘటనలో ఎవరైనా మరణించారా, గాయపడ్డారా అనే వివరాలు తెలియరాలేదు.

**దాడులు కొనసాగించిన ఇరాన్**

ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలపై క్షిపణి, డ్రోన్ దాడులను ఇరాన్ ముమ్మర స్థాయిలో కొనసాగించింది. గల్ఫ్‌లో ప్రధానంగా చమురు కేంద్రాలు, ఇతర మౌలిక వసతులను అది లక్ష్యంగా చేసుకుంటోంది. తమ దేశంపైకి పలు విడతల్లో దూసుకొచ్చిన దాదాపు 50 డ్రోన్లను కూల్చివేసినట్లు సౌదీ అరేబియా వెల్లడించింది.

ఇరాన్ శుక్రవారం తమపైకి 7 బాలిస్టిక్ క్షిపణులు, 27 డ్రోన్లను ప్రయోగించినట్లు యూఏఈ తెలిపింది. దుబాయ్‌లోని ఓ పారిశ్రామిక ప్రాంతంపైకి దూసుకొచ్చిన డ్రోన్లను విజయవంతంగా అడ్డుకున్నారు. తుర్కియేపైకి ఇరాన్ ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణిని తూర్పు మధ్యధరా ప్రాంతంలో మోహరించి ఉన్న నాటో రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నాయి.

ఇజ్రాయెల్, అమెరికా బలగాలపై 44వ విడత క్షిపణి దాడులు చేపట్టినట్లు ఇరాన్‌కు చెందిన ఐఆర్‌జీసీ ప్రకటించింది. ఒమన్‌లోని సోహర్ నగరంలో జరిగిన డ్రోన్ దాడిలో ఇద్దరు భారతీయులు మృత్యువాతపడ్డారు. ఈ ఘటనలో మరో 10 మంది భారతీయులు గాయపడ్డారు. ఇరాన్ యుద్ధం మొదలైన తర్వాత పశ్చిమాసియా నుంచి 1.50 లక్షల మంది భారతీయులు స్వదేశానికి వచ్చినట్లు విదేశీ వ్యవహారాల శాఖ సంయుక్త కార్యదర్శి అసీం మహాజన్ వెల్లడించారు. ఇజ్రాయెల్, హెజ్‌బొల్లా మధ్య పోరు మరింత తీవ్రస్థాయికి చేరింది. హెజ్‌బొల్లా రాకెట్ దాడులతో ఉత్తర ఇజ్రాయెల్‌లో దాదాపు 60 మంది గాయపడ్డారు. ఇజ్రాయెల్ దాడుల్లో లెబనాన్ రాజధాని బీరుట్‌లో ఓ వ్యక్తి మరణించారు. ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ శుక్రవారం లెబనాన్‌లో పర్యటించారు. ఇజ్రాయెల్, హెజ్‌బొల్లా కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకోవాలని గుటెరస్ పిలుపునిచ్చారు. ఇరాన్‌పై యుద్ధంలో అమెరికా ఉపయోగిస్తున్న రీఫ్యూయెలింగ్ విమానం కేసీ-135 పశ్చిమ ఇరాక్‌లో కూలిపోయింది. ఈ ఘటనలో అందులోని ఆరుగురు సిబ్బంది మృత్యువాతపడ్డారు. ట్యాంకర్ విమానం కూలిపోవడానికి శత్రువుల దాడి కారణం కాదని అమెరికా సెంట్రల్ కమాండ్ స్పష్టం చేసింది. టెహ్రాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ నిర్వహించిన దాడితో దెబ్బతిన్న ఓ భవన శిథిలాల నుంచి గాయపడిన వ్యక్తిని వెలికితీస్తున్న సహాయ సిబ్బంది

# నిషేధిత జాబితా నుంచి 66,157 ఎకరాల తొలగింపు

-మొదటిపేజీ తరువాయి

పేరిట రెవెన్యూ రికార్డుల్లో మార్చేందుకు (మ్యుటేషన్‌కు) అనుమతినిచ్చింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో శుక్రవారం జరిగిన మంత్రిమండలి సమావేశంలో పలు అంశాలపై చర్చించి, తీసుకున్న నిర్ణయాలను మంత్రి పార్థసారథి మీడియాకు వివరించారు. ఆయన మాట్లాడుతూ.. 'పారిశ్రామిక అవసరాల కోసం ఏపీఐఐసీ కేటాయించిన సుమారు 75 వేల ఎకరాల భూములు నిషేధిత జాబితాలో ఉండటంతో అక్కడ పరిశ్రమలు పెట్టినవారు వాటిపై బ్యాంకు రుణాలు పొందటం సాధ్యం కావట్లేదు. పరిశ్రమల నిర్మాణం పూర్తయిన తర్వాతా యాజమాన్య హక్కులపై అనిశ్చితి ఉంటోంది. ఈ సమస్యతో రాష్ట్రంలో ప్రాజెక్టుల నిర్మాణం ఆలస్యమై, పెట్టుబడులు రావట్లేదు. దీనికి శాశ్వత పరిష్కారంగా అభ్యంతరాల్లేని ఏపీఐఐసీ భూములను 22ఎ జాబితా నుంచి తొలగించేందుకు మంత్రిమండలి ఆమోదించింది. దీనివల్ల పారిశ్రామికవేత్తలకు సౌలభ్యం కలుగుతుంది' అని పేర్కొన్నారు. మంత్రి వెల్లడించిన అంశాలు..

**గ్రామాల్లో ఇంటింటికీ తాగునీరు**

గ్రామాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారానికి రూ.9,355 కోట్లతో 7 మల్టీవిలేజ్ స్కీమ్‌లు (ఎంవీఎస్) చేపట్టాలని నిర్ణయం. వీటిని జేజేఎం, సాస్కీ, ఎన్‌ఐడీఏ, నాబ్‌ఫిడ్ ఆర్థికసాయంతో చేపట్టాలన్న ప్రతిపాదనకు ఆమోదం. నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న 3వేల నివాస ప్రాంతాలకు రూ.1,814.71 కోట్లతో వివిధ పనుల నిర్వహణకు ఆమోదం. 112 గ్రామీణ నియోజకవర్గాల్లోని 3వేల ప్రాంతాలకు సింగిల్ విలేజ్ స్కీం ద్వారా తాగునీటిని అందించనున్నారు.

**రాజధానిలో నిర్మాణ పనులకు ఆమోదం**

అమరావతి ప్రభుత్వ కాంప్లెక్స్ పరిధిలోని ఇంటిగ్రేటెడ్ ఏపీ సెక్రటేరియట్, హెవోడీ కార్యాలయాలలో హైసైడ్ ఎలక్ట్రికల్, హెచ్‌బీఏసీ, ఫైర్ ప్రొటెక్షన్ సిస్టమ్, లిఫ్టులు, ఫైర్ అలారం, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, ప్లంబింగ్ వర్క్‌ల కోసం రూ.2,316.88 కోట్లతో డిజైన్ అండ్ బిల్డ్ పద్ధతిలో కాంట్రాక్టు ఇచ్చేందుకు క్యాబినెట్ ఆమోదించింది.

అమరావతిలోని నీరుకొండలో ఈపీసీ విధానంలో ఐదెకరాల్లో 'తెలుగు సాంస్కృతిక కేంద్రం' నిర్మాణాన్ని రూ.119.27 కోట్లతో చేపట్టేందుకు ఆమోదం. 2,000 మంది కూర్చునేలా ఆడిటోరియం, వెయ్యిమందికి సరిపడా ఓపెన్ ఎయిర్ థియేటర్‌తో పాటు తెలుగు భాష మ్యూజియం ఏర్పాటుకు ఆమోదం.

సీఆర్‌డీఏ పరిధిలో వివిధ సంస్థలకు భూముల కేటాయింపు. సీబీఎస్‌ఈ రీజినల్ కార్యాలయానికి 0.80 ఎకరాలు, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శిక్షణ సంస్థ ఎడ్యుకేషనల్ క్యాంపస్‌కు ఐదెకరాల కేటాయింపు. గతంలో నిడమర్రులో కిమ్స్, ఆదిత్య విద్యాసంస్థలకు కార్పొరేట్ ఆసుపత్రి కోసం 25 ఎకరాల కేటాయింపుల్లో మార్పులు.. రోడ్డు నిర్మాణంలో కోల్పోయిన స్థలానికి పరిహారంగా తుళ్లూరు ఎడ్యుకేషనల్ సొసైటీకి మరో 3 ఎకరాల కేటాయింపు.

**పోలవరం టన్నెళ్లలో అదనపు వ్యయానికి ఆమోదం**

పోలవరం ప్రధాన డ్యాం కుడి కాలువకు నీళ్లు అందించే సొరంగాల్లో ప్యాకేజీ 63 పనులు వేగంగా పూర్తిచేసేందుకు అదనపు గ్యాంట్రీ కొనుగోలు, తొలుత అంచనాల కన్నా అధికంగా లైనింగ్ పని పెరుగుతున్నందున రూ.23.47 కోట్ల అదనపు వ్యయానికి మంత్రిమండలి ఆమోదం. ప్యాకేజీ 64(ఏ)లో కూడా అదనపు గ్యాంట్రీ కొనుగోలు, పని మార్పు వల్ల అదనంగా ఖర్చయ్యే రూ.24.51 కోట్లకు అనుమతి. పోలవరం ప్రాజెక్టు ప్రధాన డ్యాం కుడివైపున జంట సొరంగాలు నిర్మిస్తున్నారు. ప్యాకేజీ 63లో 900 మీటర్ల పొడవున, ప్యాకేజీ 64లో 880 మీటర్ల మేర నిర్మిస్తున్నారు.

## ప్రజల్ని తప్పుదోవ పట్టించేలా జగన్ కుట్రలు

-మొదటిపేజీ తరువాయి

రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తోంది. ఇప్పటికైనా వైకాపా నాయకులు సూపర్ సిక్స్‌పై, కూటమి పాలనపై అబద్ధాలు ప్రచారం చేయడం మానుకోవాలి' అని హితవు పలికారు.

## భాజపా వచ్చాకే ఈశాన్యంలో శాంతి

-మొదటిపేజీ తరువాయి

రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ను శిక్షించాలని పిలుపునిచ్చారు. స్థానికుల భూములను చొరబాటుదారులకు కట్టబెట్టడం ద్వారా దేశ భద్రతను కాంగ్రెస్ ప్రమాదంలోకి నెట్టిందని విమర్శించారు. గువాహటిలో జరిగిన కార్యక్రమంలో తేయాకు తోటల్లో పనిచేసే కార్మిక కుటుంబాలకు మోదీ భూమి పట్టాలు అందజేశారు.

## భారత్ బాధపడితే మేం కూడా బాధపడతాం

-మొదటిపేజీ తరువాయి

భారత ఇరాన్ రాయబారి డాక్టర్ మొహమ్మద్ ఫతాలీ స్పష్టం చేశారు. ఇరు దేశాలు ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు పరస్పరం సహకరించుకుంటూ ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ద్వైపాక్షిక సంబంధాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్, ఇరాన్ ప్రజల మధ్య బలమైన ఐక్యతా భావం ఉందని, అదే ద్వైపాక్షిక సహకారానికి పునాది అని ఫతాలీ పేర్కొన్నారు. "భారత ప్రజల కష్టం మా కష్టంగా భావిస్తాం, మా కష్టాన్ని వారు తమదిగా చూస్తారు. ఈ కారణంగానే భారత ప్రభుత్వం మాకు సహాయం చేస్తోంది. మేం కూడా భారత ప్రభుత్వానికి అండగా నిలవాలి. ఎందుకంటే మనకు ఉమ్మడి విశ్వాసాలు, ఉమ్మడి ప్రయోజనాలు ఉన్నాయి" అని ఆయన వివరించారు. భారత్‌లో ఇరాన్ రాయబారిగా, ఇరు దేశాల మధ్య అవగాహన, సహకారాన్ని మరింత బలోపేతం చేయడమే తన లక్ష్యమని తెలిపారు. ఇటీవల ఇరు దేశాల ఉన్నతాధికారుల మధ్య కీలక చర్చలు జరిగాయని ఫతాలీ వెల్లడించారు. "మా ఉన్నత స్థాయి అధికారులు భారత ప్రభుత్వ అధికారులతో చర్చలు జరిపారు. ఉమ్మడి ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై ఫలప్రదమైన సంప్రదింపులు జరిగాయి" అని ఆయన పేర్కొన్నారు. ద్వైపాక్షిక సంబంధాలలో ఎదురయ్యే అడ్డంకులను తొలగించేందుకు ఇరుపక్షాలు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నాయని, భవిష్యత్తులో సహకారం మరింత విస్తరిస్తుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ మధ్య జరిగిన చర్చలను ఆయన ప్రస్తావిస్తూ, ఇరు దేశాల నాయకత్వం సంబంధాలను పటిష్టం చేసేందుకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఇంటర్నేషనల్ ఖుద్స్ డే కాన్ఫరెన్స్ 2026 గురించి మాట్లాడుతూ, ప్రజలు న్యాయం, సత్యం వైపు నిలబడాలని పిలుపునిచ్చారు. "చరిత్రలో సరైన వైపు నిలబడేందుకు ప్రయత్నించండి" అని ఆయన సూచించారు. ఇరాన్ తన సూత్రాలు, విలువల ఆధారంగానే ముందుకు సాగుతుందని, భారత్ వంటి మిత్ర దేశాలతో సహకారాన్ని కొనసాగిస్తుందని డాక్టర్ ఫతాలీ తేల్చిచెప్పారు.

## ఒమన్‌లో డ్రోన్ దాడి... ఇద్దరు భారతీయులు మృతి

-మొదటిపేజీ తరువాయి

లేదని వెల్లడించింది. డ్రోన్ దాడిలో గాయపడిన మిగిలిన వారు కూడా చికిత్స పొంది ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయినట్లు విదేశాంగ శాఖ తెలిపింది. ఒమన్ అధికారులు, సంబంధిత కంపెనీ ప్రతినిధులతో టచ్‌లో ఉన్నట్లు తెలిపింది. వారికి అవసరమైన సాయం అందిస్తున్నామని వెల్లడించింది. ఇదిలా ఉండగా, ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి 1.50 లక్షల మంది భారత్‌కు వచ్చినట్లు భారత విదేశాంగ తెలిపింది. ఒమన్ డ్రోన్ దాడికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని చెప్పారు. ఒమన్ న్యూస్ ఏజెన్సీ ప్రకారం, సోహార్‌లో రెండు డ్రోన్ దాడులు జరిగాయి. ఇందులో ఒకటి అల్ అవి ఇండస్ట్రియల్ జోన్‌ను తాకిందని, ఇక్కడ పనిచేసే భారతీయులు ఇద్దరు మృతి చెందారు.

## అనవసర ఆందోళనతో గ్యాస్ బుక్ చేయొద్దు

-మొదటిపేజీ తరువాయి

గ్యాస్ గురించి ఆందోళన చెందవద్దని, దేశీయంగా ఎల్పీజీ ఉత్పత్తి 30 శాతం పెరిగిందని పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వశాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ శుక్రవారం వెల్లడించారు. పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ) నెట్‌వర్క్‌లకు దగ్గరున్న దాదాపు 60 లక్షల ఇళ్లు పీఎన్‌జీకి మారాలని, తద్వారా ఎల్పీజీపై ఆధారపడాల్సిన అవసరం ఉండదన్నారు. ప్రస్తుతం దేశంలో గ్యాస్ డిమాండ్‌లో భారీ వ్యత్యాసం కనిపిస్తోందని, అవసరం లేకపోయినా ఆందోళనతో బుకింగ్‌లు చేయొద్దని సూచించారు. 'యుద్ధానికి ముందు.. రోజుకు 55.7 లక్షల సిలిండర్లు బుక్ అయ్యేవి. ఇప్పుడు ఆ సంఖ్య అమాంతం 75.7 లక్షలకు పెరిగింది. అంటే ఆందోళనతో బుకింగ్‌లు పెరుగుతున్నాయని తెలుస్తోంది. ఎలాంటి వదంతులు వ్యాప్తి చేయొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం' అని ఆమె పేర్కొన్నారు. 'ముడిచమురు విషయానికొస్తే.. మనవద్ద 258 మిలియన్ మెట్రిక్ టన్నుల రిఫైనింగ్ సామర్థ్యం ఉంది. పెట్రోల్, డీజిల్ ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాం. ప్రస్తుత పరిస్థితుల్లో కచ్చితంగా దిగుమతులపై ఆధారపడాల్సిన అవసరం లేదు. మన రిఫైనరీలు 100 శాతం సామర్థ్యంతో పనిచేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఆందోళన చెందాల్సిన పని లేదు' అని భరోసానిచ్చారు. మరోవైపు, ఎల్పీజీ కొరతను అధిగమించేందుకు కేంద్రం వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. గ్యాస్ కొరతతో గ్రామీణ ప్రజలు చెక్క, బొగ్గులతో వంటచేసేందుకు ఆసక్తి చూపుతున్నారని, ఇదే కొనసాగితే అది మరో సవాలుగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశాయి.

**అనేక రాష్ట్రాల్లో అస్తవ్యస్తం!**

పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా దేశవ్యాప్తంగా ఏర్పడిన వంట, వాణిజ్య గ్యాస్ సిలిండర్‌ల కొరత వివిధ రాష్ట్రాల్లో తీవ్ర ప్రభావాన్ని చూపిస్తోంది. పెట్రోల్, డీజిల్, కిరోసిన్, ఎల్పీజీలకు ఎలాంటి కొరత లేదని కేంద్రం చెబుతోన్నా.. ఆస్పత్రులు, హోటళ్లు, రెస్టారెంట్లు, వసతి గృహాలు మొదలైన చోట్ల పరిస్థితి మరింత తీవ్రమైంది. కొన్నిచోట్ల గ్యాస్ సిలిండర్‌లను సాధారణం కంటే రెండు, మూడు రెట్ల మేర ధరలు పెంచి విక్రయిస్తున్నారు. వంట చెరకు ధరలకు కూడా రెక్కలొచ్చాయి. మరికొన్ని చోట్ల సిలిండర్‌లను దొంగిలిస్తోన్న ఉదంతాలూ వెలుగులోకి రావడం గమనార్హం.

# అమరావతిలో బిట్స్ పిలాని నిర్మాణ ప్లాన్ లను పరిశీలించిన లోకేష్.





**అమరావతి, మార్చి 13:** అమరావతిలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న బిర్లా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బిట్స్) పిలాని ఏఐ ప్లస్ క్యాంపస్ నిర్మాణానికి సంబంధించిన ప్లాన్లను రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పరిశీలించారు. బిట్స్ ప్రతినిధులు సిద్ధార్థ బెనర్జీ, ఎన్.చెన్నవీర్, బీఎస్ సహాని శుక్రవారం ఉండవల్లి నివాసంలో మంత్రి లోకేష్ ను కలిసి బిట్స్ ఏఐ క్యాంపస్ ప్లాన్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా బిట్స్ ప్రతినిధులు మాట్లాడుతూ ఏఐ, డేటా సైన్స్, రోబోటిక్స్, కంప్యూటేషనల్ లింగ్విస్టిక్స్, సైబర్ ఫిజికల్ సిస్టమ్స్ తదితర కోర్సులు అమరావతి క్యాంపస్ లో ఉంటాయని తెలిపారు. రెండు దశల్లో 7 వేల మంది విద్యార్థులకు అవకాశం కల్పించేలా అమరావతి బిట్స్ పిలాని నిర్మాణాలను చేపడుతున్నాం. ఈ క్యాంపస్ పై వచ్చే ఐదేళ్లలో వెయ్యికోట్ల పెట్టుబడి పెడతాం అని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికతకు అనుగుణంగా నెక్స్ జెన్ టెక్నాలజీలతో ఈ క్యాంపస్ నిర్మిస్తున్నాం అని, ఇప్పటికే నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయన్నారు. నిర్మాణంలో గ్రీన్ బిల్డింగ్, రెన్యువబుల్ ఎనర్జీ వంటి పర్యావరణహిత విధానాలను పాటిస్తున్నాం. అమరావతి బిట్స్ దేశం లోనే మొదటి ఏఐ క్యాంపస్ గా ఉండబోతోంది. అధునాతన సాంకేతికలతో పాటు వ్యవసాయం నుంచి వాతావరణం, ఆరోగ్య సంరక్షణ వంటి కోర్సులు కూడా ఇక్కడ ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు బిట్స్ ప్రతినిధులు తెలిపారు. బిట్స్ నిర్మాణ ప్లాన్లను పరిశీలించిన మంత్రి లోకేష్ సంతృప్తి వ్యక్తంచేశారు. సాధ్యమైనంత త్వరగా అమరావతి క్యాంపస్ ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

# తెలుగు జాతి గర్వించ దగ్గ కవయిత్రి మొల్ల.





**రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత.**

**తాడేపల్లి, పెన్ సత్తా, మార్చి 13:** తెలుగుజాతి గర్వించదగ్గ కవయిత్రి ఆతుకూరు మొల్ల(మొల్లమాంబ) అని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. నన్నయ్య ఆదికవి అయితే, ఆది కవయిత్రి మొల్ల అని అన్నారు. తెలుగు సాహిత్యంలో మొల్ల రచనలకు ప్రత్యేకమైన స్థానం ఉందని మంత్రి సవిత తెలిపారు. తాడేపల్లి లోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం తెలుగు కవయిత్రి మొల్లమాంబ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ మొల్లమాంబ తెలుగు రచయిత కావడం అదృష్టమన్నారు. కడప జిల్లా గోపవరం గ్రామంలో సామాన్య మైన కుమ్మరి కుటుంబంలో జన్మించిన మొల్ల శ్రీరాముని భక్తురాలన్నారు. వాల్మీకి రామాయణాన్ని సరళ మైన తెలుగు భాషలో అనువదించిన మహనీయురాలన్నారు. ఈ రామాయాణం మొల్ల రామాయాణంగా ప్రఖ్యాత గాంచిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. తెలుగులో తొలి మహా కావ్యం మొల్ల రామాయణమన్నారు. మొల్ల తన రచనలలో నైతిక విలువలకు ప్రాధాన్యమిచ్చారన్నారు. నేటి తరం మహిళాలకు, కవయిత్రిలకు మొల్ల ఆదర్శనీయమన్నారు. మొల్ల రచనలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరి పై ఉందని మంత్రి సవిత పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేషన్ చైర్మన్లు వీరంకి వెంకట గురుమూర్తి, పేరేపి ఈశ్వర్, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధికార ప్రతినిధి పఠాన్ హయత్ ఖాన్ తో పాటు ఇతర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే బండారును కలిసిన పెందుర్తి నూతన ఎంపీపీ మాలతి నగేష్.





**పరవాడ, పెన్ సత్తా, మార్చి 13:**తెదేపా సీనియర్ నేత, మాజీ మంత్రి, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి ని పెందుర్తి మండల పరిషత్ అధ్యక్షురాలు నూతనంగా ఎన్నిక కాబడిన గన్రెడ్డి మాలతి నగేష్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే బండారును వెన్నెలపాలెం లో గల ఆయన స్వగృహంలో ఎంపీపీ మాలతి నగేష్ కలిసి ఎంపీపీ ఎన్నికకు సహకరించినందుకు హృదయ పూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు ఎంపీపీ మాలతి నగేష్ కు స్వీట్ తినిపించి, హర్షం వ్యక్తం చేస్తూ శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సుఖవాసి ప్రసాద్, వైస్ ఎంపీపీ చిరికి దేవుడు, ఎంపీటీసీలు గండి హిమబిందు భూషణ్, స్వప్న గిరి, మండల కో ఆప్షన్ సభ్యులు శివ, మాజీ మండల పార్టీ అధ్యక్షులు కరక దేవుడు తదితరులు పాల్గొన్నారు.

# శాంతికి మూలం నూకాలమ్మ తల్లి

**ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు**



**భీమిలి, పెన్ సత్తా, మార్చి 13:**ప్రశాంతతకు, శాంతికి, ధైర్యానికి ప్రతిరూపం నూకాలమ్మ తల్లి అని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు.

భీమిలి గ్రామదేవత నూకాలమ్మ ఉత్సవాల సందర్భంగా ఉత్సవకమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ముఖ్య అతిధిగా విచ్చేసి విడుదల చేసారు. ఎంవిపిలో ఉన్న ఎమ్మెల్యే నివాసం వద్ద జరిగిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ నూకాలమ్మ తల్లి అంటే ప్రజల గుండె చప్పుడు అని అన్నారు. అమ్మా అని పిలిస్తే పలికే కల్పతరువు నూకాలమ్మ అమ్మవారని అన్నారు. ప్రజలందరినీ కంటికి రెప్పలా కాపాడే ధైర్యశీలని, శాంత మూర్తికి ప్రతిరూపమని అన్నారు. భీమిలిలో స్వయంగా వెలసి 300 ఏళ్లుగా పరిసర ప్రాంత ప్రజలను కంటికి రెప్పలా కాపాడే అమ్మవారు కొలువై ఉన్న నియోజకవర్గంలో నేను రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచానని, ఎన్నికల ప్రచారంలో నూకాలమ్మ తల్లి ఆశీస్సులు తీసుకొని ప్రారంభిస్తానని గుర్తు చేసుకున్నారు. ఉత్సవాలు సజావుగా జరగాలని అందుకు కావలసిన ఏర్పాట్లు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశానని అన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు గంటా నూకరాజు, మారోజు సత్యప్రసాద్(గొల్లబాబు), శిల్లా కరుణాకర్ రెడ్డి, గాడు యస్వంత్ కుమార్, ఉసిరికల బంగార్రాజు (తాతాజీ ) లు మాట్లాడుతూ మార్చి 17 నుండి 20 వ తారీకు వరకు నాలుగురోజుల పాటు జరిగే ఉత్సవాల్లో నాలుగు స్టేజ్ లు ఏర్పాటు చేసామని రోజుకు నాలుగు కార్యక్రమాలు చొప్పున 11 స్టేజ్ కార్యక్రమాలు ఉంటాయని అన్నారు. ఊరేగింపు కూడా భారీస్థాయిలో ఉంటుందని భక్తులందరూ సహకరించి నూకాలమ్మ తల్లి ఉత్సవాలు ఘనంగా జరిపించడం కోసం అందరూ సహకరించాలని కోరారు. అదే విదంగా అమ్మవారి దర్శనాలు మార్చి 18 వ తారీకు నుండి ఉంటాయని భక్తులు సమన్వయం పాటించి అమ్మ ఆశీస్సులు తీసుకొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ఉత్సవ కమిటీ సభ్యులకు, పోలీస్ వారికి సహకరించాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఉత్సవకమిటీ సభ్యులతో పాటు నియోజకవర్గం ఇంచార్జ్ చిక్కాల విజయ్ బాబు, రెండవ వార్డు కార్పొరేటర్ గాడు చిన్ని కుమారి లక్ష్మీ, భక్తులు మైలపల్లి షణ్ముఖరావు, గొలగాని నరేంద్రకుమార్, వాసుపల్లి కొండబాబు, కనకల అప్పలనాయుడు, వాడమొదలు సత్యారావు, కాసరపు ఎల్లాజీ, కంచెర్ల కామేష్, ముక్కి క్రిష్ణ,అర్ధపాకల గురునాధరావు, ప్రభాకర్ నాయుడు, వియ్యపు పోతురాజు, చిన్నిరాజు, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన కోడ్స్ తో కార్మికులకు మేలు వాసంశెట్టి సుభాష్







**అమరావతి, పెన్ సత్తా, మార్చి 13:** నూతనంగా అమలు చేస్తున్న కార్మిక కోడ్స్ వల్ల కార్మికులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు.

గురువారం వెలగపూడి సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏపీపిఎస్సి ద్వారా ఎంపి కైన 20 సహాయ కార్మిక శాఖాధికారులు, ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లకు మంత్రి సుభాష్ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈరోజు నుండి కార్మిక శాఖ కుటుంబంలో మీరంతా సభ్యులంటూ అటు పారిశ్రామికవేత్తలు, ఇటు కార్మికుల ప్రయోజనాలను పరిరక్షించడంలో ఎఎల్వోలు కీలకంగా వ్యవహరించాలని

ఆయన కోరారు. కార్మిక కోడ్స్ పై కార్మికులకు అహగాన కల్పించే బాధ్యతను కూడ ఛాలెంజ్ గా తీసుకోవాలని మంత్రి సుభాష్ సూచించారు. గతంలో ఉండే కార్మిక చట్టాలకు బదులుగా కేంద్రం తెచ్చిన నాలుగు కోడ్స్ వల్ల కార్మికులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్మిక శాఖాధికారులుగా బాధ్యతగా వ్యవహరిస్తూ తమ శాఖకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని సుభాష్ కోరారు. గత వైసీపీ పాలనలో కార్మికశాఖను పూర్తిగా నిర్వీర్యం చేశారని మంత్రి విమర్శించారు. కార్మికుల ప్రయోజనాలను తుంగ లోకి తొక్కిన చరిత్ర గత పాలకులదని ఆయన ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత పారిశ్రామికంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎంతో ప్రగతిని సాధిస్తున్నదని పెట్టుబడులు వెల్లువ కొనసాగుతోందన్నారు. అవినీతికి తావులేకుండా బాధ్యతగా తమ విధులను నిర్వహిస్తూ కార్మికశాఖ ప్రతిష్టను ఇనీమడింప జేయగలరన్నా ఆశాభావాన్ని మంత్రి సుభాష్ వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికశాఖ కమిషనర్ గంధం చంద్రుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య పాలనకు దర్పణం పడుతున్న ప్రజాదర్బారు.

- మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాదు.
- గొల్లపూడిలో 50 అర్జీలు సమర్పణ.








**మైలవరం, పెన్ సత్తా, మార్చి 13:**ఎన్డీఏ కూటమి ప్రభుత్వ ప్రజాస్వామ్య పాలనకు 'ప్రజాదర్బారు' కార్యక్రమ నిర్వహణ దర్పణం పడుతోందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాదు పేర్కొన్నారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి లోని శాసనసభ్యుని కార్యాలయంలో శుక్రవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక (ప్రజాదర్బారు) నిర్వహించారు. ఈ వేదికకు మొత్తం 50 మంది ఆర్జీలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాదు ప్రజల నుంచి ఆర్జీలు స్వీకరించి, వారి సమస్యలను ఓపిగ్గా విన్నారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇళ్లు, ఇళ్ల స్థలాలు, ఇళ్లస్థలాల క్రమబద్ధీకరణ, రైస్ కార్డులు, ఉపాధి, పెన్షన్లు, దివ్యంగుల సర్టిఫికెట్లు మంజూరు, వివిధ రెవెన్యూ సేవలు, పోలీసు సేవలకు సంబంధించి అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాదు మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన ఆర్జీలను పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సెల్ సిస్టం (పి.జి.ఆర్.ఎస్) ద్వారా ఆన్ లైన్ లో నమోదు చేసి జవాబుదారీతనంతో పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు.

ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందన్నారు. ప్రభుత్వ అధికార యంత్రాంగం, సిబ్బంది బాధ్యతతో వ్యవహరించాలన్నారు. ప్రజలకు నాణ్యతతో కూడిన సేవలు అందించి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. రాష్ట్ర ప్రజల నమ్మకాన్ని కూటమి ప్రభుత్వం నిలబెడుతుందన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు, రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. హామీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని అన్నారు. ప్రజాదర్బార్ వేదికలో అన్నిశాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు అందుబాటులో ఉంటారన్నారు. ఇక్కడ వచ్చే సమస్యలను నెల రోజుల వ్యవధిలో పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), అధికారులు, ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు భాష ఉన్నంతవరకు మొల్లమాంబ కీర్తి నిలిచి ఉంటుంది.

- మొల్ల రామాయణం అజరామరం.
- మొల్ల జయంతి ఉత్సవంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.



**కొత్తపేట, పెన్ సత్తా, మార్చి 13:**అచ్చ తెలుగులో రామాయణాన్ని రచించి అజరామర మైన కీర్తిని పొందిన మహాకవయిత్రి మొల్లమాంబ ఖ్యాతి తెలుగు భాష ఉన్నంత వరకు నిలిచి ఉంటుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కొనియాడారు. శుక్రవారం మొల్లమాంబ జయంతి సందర్భంగా వాడపాలెం ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే బండారు కవయిత్రి మొల్ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సామాన్య కుటుంబంలో పుట్టి ఎన్నో కష్టాలు పడి తొలి తెలుగు కవయిత్రిగా మొల్లమాంబ ఎదిగిన తీరు అందరికీ ఆదర్శమన్నారు. మొల్ల రామాయణంలో పద్యాలు సామాన్యులకు సైతం అర్థమయ్యే విధంగా ఉంటాయని వ్యాఖ్యానించారు. మొల్లమాంబ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పండుగగా నిర్వహించడం తెలుగు భాషకే గర్వకారణమన్నారు.

## అన్నదాత సుఖీభవ -పీఎం కిసాన్ మూడో విడత పంపిణీలో పంచకర్ల



**సబ్బవరం, పెన్ సత్తా, మార్చి 13:**అన్నదాత సుఖీభవ -పీఎం కిసాన్ మూడో విడత పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు, పెందుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు.

సబ్బవరం మండలం ఆశకపల్లి గ్రామంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిరుపేద రైతుల కోసం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా పెందుర్తి నియోజకవర్గం పరిధిలో సుమారు, 10,446 మంది రైతులకు ప్రభుత్వ సహాయం అన్నదాత సుఖీభవ అందజేస్తున్నామన్నారు. అంతకు ముందు ఆసకపల్లి లో రైతులు రెండో పంటకు వేసిన వరి పొలాన్ని ఆయన సందర్శించి, ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ అధికారులు పనితీరు పై ప్రశ్నలు రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయం స్టాల్స్ ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధిలో రాష్ట్రాన్ని పరుగులు పెట్టిస్తుంటే అధికారులు నిర్లక్ష్యము అవలంబించడం ఎంతవరకు న్యాయమని నిలదీశారు. ఎమ్మెల్యే పంచకర్ల మీడియాతో మాట్లాడుతూ 3 విడత అన్నదాత సుఖీభవ పథకంలో 18 వేల మంది రైతులకు ఖాతాల్లో వేయటం ద్వారా పంపిణీ చేయటం జరిగింది అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక పెందుర్తి నియోజకవర్గం పరిధిలో 450 కోట్ల రూపాయల నిధులతో రోడ్ల అభివృద్ధి చేసుకున్నామని తెలిపారు. గత ప్రభుత్వాలు వదిలిన భారాన్ని తట్టుకుంటూనే అభివృద్ధి సంక్షేమాన్ని రెండు చక్రాలుగా కేంద్ర ప్రభుత్వం ప్రధాని మోదీ సహాయ సహకారాలతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు రాష్ట్రాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సభకు అసకపల్లి సర్పంచ్ కర్రీ నరసింగరావు అధ్యక్షత వహించగా, మండల వ్యవసాయ శాఖ అధికారి పోతన సత్యనారాయణ, మండల ప్రజా పరిషత్ అధికారి పద్మజ, మండల రెవెన్యూ అధికారి చిన్న కృష్ణ, బిజెపి నేతలు గొర్లి రామ నాయుడు, పెందుర్తి ఎంపీపీ గనిరెడ్డి మాలతి, మండల పార్టీ అధ్యక్షులు కర్రీ కనకరాజు, మండల నాయకులు బలిరెడ్డి అప్పారావు, రోమాల.చంద్రశేఖర్, మామిడి శంకర్రావు, బయలు పూడి దేవుడి బాబు, మొదలగు సబ్బవరం మండలం ఉమ్మడి ఎన్ డి ఏ మహాకూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామ పెద్దలు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.


## నేడు జాతీయ లోక్ అదాలత్

**4 వ అదనపు జిల్లా జడ్జి, గుంటూరు ఎఫ్.ఏ.సీ. చైర్మన్ ఆర్ శరత్ బాబు**

**బాపట్ల,పెన్ సత్తా,మార్చి 13 :**జాతీయ న్యాయ సేవాధికార సంస్థ,న్యూఢిల్లీ వారి వార్షిక కార్యాచరణ ప్రణాళిక ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ,అమరావతి ఆదేశానుసారం,జిల్లా న్యాయ సేవాధికారసంస్థ గుంటూరు వారి ఆధ్వర్యంలో బాపట్ల కోర్టుల సముదాయము నందు మండల న్యాయ సేవా కమిటీ బాపట్ల ఆధ్వర్యంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ ను నిర్వహించనున్నట్లు 4 వ అదనపు జిల్లా జడ్జి,గుంటూరు ఎఫ్.ఏ. సీ.చైర్మన్ ఆర్.శరత్ బాబు శుక్రవారం తెలిపారు.ఈ జాతీయ లోక్ అదాలత్ నందు బాపట్ల కోర్టులలో పెండింగ్ లో ఉన్న అన్ని రకాల సివిల్ కేసులు,భరణం కేసులు,గృహ హింస కేసులు,మోటార్ ప్రమాద కేసులు,చెక్ బౌన్స్ కేసులు,రాజీ పడదగిన క్రిమినల్ కేసులు మరియు ముందస్తు రాజీ చేసుకోదలచిన కేసులు ఇరుపక్షాల మధ్య సామరస్య పూర్వకంగా రాజీ చేసి,పరిష్కారించబడుతాయని అన్నారు.కావున బాపట్ల న్యాయస్థానాల పరిధిలోని కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ వివాదాలకు శాంతియుతంగా రాజీ చేసుకుని పరిష్కారించుకోవాలని కోరారు.

## కూటమి హయంలో నూకాలమ్మ ఆలయ అభివృద్ధి వేగవంతం బండారు.

- ఆలయంలో రూ.1.18 కోట్లతో నిర్మించిన రెండు రాజగోపురాలు
- వీటితో పాటు, వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు.
- జాతరకు వచ్చే భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు.
- సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.







**కొత్తపేట, పెన్ సత్తా, మార్చి 13:**ఉభయగోదావరి జిల్లాలో అత్యంత ప్రముఖ మైన చింతలూరు నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలకు లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశించారు. శుక్రవారం దేవస్థానంలో నూతనంగా నిర్మించిన రాజగోపురాలు, పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం చేశారు. దేవస్థాన ప్రాంగణంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే బండారు, జనసేన ఇన్చార్జ్ బండారు శ్రీనివాస్, కొత్తపేట డిఎస్పీ సుంకర మురళి మోహన్, ఎంపీడీవో రాజు, ఎమ్మార్వో కేజే ప్రకాష్ బాబు తదితరులతో కలిసి పాల్గొన్నారు. మొదటగా దాతల సహకారంతో రూ.80 లక్షల నిధులతో నిర్మించిన తూర్పు, పడమర రాజగోపురాలను, రూ.5 లక్షల దేవస్థానం నిధులతో నిర్మించిన 5 షెడ్లను, రూ.9 లక్షల దేవస్థానం నిధులతో కొనుగోలు చేసిన జనరేటర్ ను, రూ.24 లక్షలతో స్వచ్ఛ భారత్ స్కీము ద్వారా నిర్మించిన 24 టాయిలెట్స్ ను ఎమ్మెల్యే బండారు ప్రారంభించారు. అనంతరం సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతలూరు నూకాలమ్మ ఆలయంలో దేవస్థానం నిధులు, దాతల సహకారంతో గత రెండేళ్లలో అద్వితీయమైన అభివృద్ధి జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా దాతల సేవలను కొనియాడారు. ఈ మధ్య ఆలయంలో నూతనంగా తీసుకుని వచ్చిన నెల రోజులు పాటల ద్వారా రూ.70 లక్షల వరకూ ఆదాయం దేవస్థానానికి లభించిందని తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. మరీ ముఖ్యంగా భక్తులకు క్యూ లైన్లు, త్రాగునీటి ఏర్పాట్లు పటిష్టంగా చేయాలన్నారు. శానిటేషన్ విషయంలో శ్రద్ధ చూపించాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దర్శనం సమయంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. అనంతరం నూకాలమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రచయిత సూర్య ఆకుల అమ్మవారి పై రచించి, వీడియో గా రూపొందించిన గీతాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# రైతన్న సేవలో.. మన మంచి ప్రభుత్వం





**అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ పథకంలో మూడో విడత విడుదల**

**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 13**: పట్టణం లోని గుండాల జంక్షన్ లో ఉన్నటువంటి ఆర్ ఏ ఆర్ ఎస్ నందు వ్యవసాయ శాఖ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, వ్యవసాయ సహాయ సంచాలకుల ఆధ్వర్యంలో అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ మూడో విడత పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు పివిఎన్ మాధవ్, ఏపీయుఎఫ్ఐడిసి చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, మాజీ శాసన మండలి సభ్యులు బుద్ధ నాగ జగదీష్ ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్ ని, వ్యవసాయ యంత్రాలను పరిశీలించారు. అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గౌహతి నుండి లైవ్ ప్రసంగాన్ని వీక్షించి, తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గన్నవరం నుండి లైవ్ ప్రసంగం వీక్షించారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ రైతు సోదర, సోదరీ మణులకు చేతులెత్తి నమస్కారం తెలుపుతూ రైతే రాజు కావాలని అని కొనియాడారు. ఇటువంటి బృహత్తర కార్యక్రమం చేయబడుతూ, రైతులకు ఒక ఆధారం చూపించాలని ఉద్దేశంతో ఎన్నికల ముందు ఏదైతే వాగ్దానం చేశారో రాష్ట్రం ఇబ్బందుల్లో ఉన్నా సరే ప్రతిష్టాకరంగా ఈ కార్యక్రమంలో చేపడుతున్నారు అన్నారు. సూపర్ 6 లో భాగంగా అన్ని కార్యక్రమంలో నెరవేస్తున్న సందర్భంలో ఈ కార్యక్రమం కూడా నెరవేరుస్తున్నారు అంటూ రైతులకు అండగా ఈ ప్రభుత్వం నిలబడుతుంది అన్నారు. సాగు భూమి ఉన్న ప్రతి రైతు కుటుంబానికి అటవీ భూమి సాగుదారు కుటుంబాలకు అన్నదాత సుఖీభవ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం 14,000 రూపాయలు, పీఎం కిసాన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం 6,000 రూపాయలు కలిపి సంవత్సరానికి 20,000 చొప్పున ఆర్థిక సహాయం రైతులు అందజేస్తున్నారన్నారు. సూపర్ 6 లో భాగంగా ఈరోజు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చే 22 విడతగా పిఎం కిసాన్ నిధులు 2,000/- చొప్పున, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ చే అన్నదాత సుఖీభవ పథకం ద్వారా 4,000/- రూపాయలు కలిపి మూడవ విడతగా మొత్తం 6000/- రూపాయలు రాష్ట్ర వ్యాప్తంగా 46,85,838 మంది రైతులు ఖాతాల్లో రూ. 2675. 97 కోట్ల జమ చేయుచున్నారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ కింద అనకాపల్లి జిల్లా లో 2,42,536 మంది లబ్ధిదారులు ఉండగా 134.27 కోట్ల రూపాయలు, అనకాపల్లి నియోజకవర్గంలో 22,202 మంది లబ్ధిదారులుగాను 12.30 కోట్ల రూపాయలు చెక్కులను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా రాష్ట్రగవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వర రావు, డీసీఎంఎస్ చైర్మన్ బాలాజీ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, ఇతర సంస్థల చైర్మన్లు, వ్యవసాయ శాఖ సంబంధిత అధికారులు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



# 87 వ వార్డ్ లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన.





- ముఖ్య అతిధిగా టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, శాసనసభ్యులు పల్లా

**గాజువాక, పెన్ సత్తా, మార్చి 13:** నియోజకవర్గం 87 వ వార్డ్ పరిధిలో కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదులుగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక నియోజకవర్గం శాసనసభ్యులు పల్లా శ్రీనివాస రావు, రాష్ట్ర కార్యదర్శి, స్థానిక వార్డ్ కార్పొరేటర్ బొండా జగన్నాధం (జగన్) పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఒక పక్కన అభవృద్ధి చేస్తూ, పేదలకు సంక్షేమ పథకాలను అందిస్తుందని అన్నారు. ఇవి రాష్టంలో సమర్థవంత మైన నాయకుడిని ఎన్నుకుంటే నే సాధ్యం అని, రాష్టంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి అన్నారు. ఈ సందర్భంగా బొండా జగన్నాధం (జగన్) మాట్లాడుతూ నన్ను నమ్మి గెలిపించిన వార్డు ప్రజలకు వమ్ము చేయకుండా వార్డ్ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నానని, వార్డులో అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు సుమారు యాభై కోట్ల నిధులు రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు సహకారంతో మంజూరు చేయించు కొని ఆ పనులు జరిపిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు విజయరామరాజు, బిజెపి జిల్లా సెక్రెటరీ లక్కరాజు సోమరాజు, జనసేన అధ్యక్షులు సిరసపల్లి కనకరాజు, సెక్రెటరీ బొట్టా ప్రకాష్, సీనియర్ నాయకులు డివి అప్పారావు, ప్రగడ దానయ్య, పావడ వెంకటరమణ మూర్తి, కే శ్రీనివాస్ నాయుడు, ద్రోణాద్రి అప్పల నాయుడు, బొడ్డేటి సత్తిబాబు, కడుపుట్ల శ్రీను, కణితి ఈశ్వర రావు, భాగ్యలక్ష్మి, జాన్ రమేష్, సుందర్ సునీల్, వై భాస్కర రావు, పోతల కృష్ణ, దాలయ్య, ఆదినారాయణ, సూరిబాబు, మూర్తి, కిరణ్, తుట్టా పైడిరాజు, రవికాంత్, సంద్రన రాజేష్, వై నాగేశ్వర రావు, రంజిత్, తిరుమల నగర్ అసోసియేషన్ సభ్యులు, గణేష్ నగర్ అసోసియేషన్ సభ్యులు, సిద్ధార్థ నగర్ అసోసియేషన్ సభ్యులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నూకంబిక అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాలు





✸ **భక్తుల రద్దీకి తగ్గట్లు పక్కా ఏర్పాట్లు చేయాలని ఆదేశించిన జిల్లా కలెక్టర్.**


**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 13 :** నూకంబిక అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాలు మార్చి 17 నుండి, ఏప్రిల్ 17 వరకు జరగనున్నందున పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ మీటింగు హాలులో జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో పలు అంశాల పై మార్గదర్శకాలు జారీ చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ప్రణాళికతో చర్యలు చేపట్టాలని, ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని పేర్కొన్నారు. సామాన్య భక్తులతో పాటు వీఐపీ, వీవీఐపీల దర్శనాలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జరిగేలా ఆలయ, పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని, వాహనాలకు పార్కింగ్ సదుపాయం కల్పించాలని సూచించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా సరిపడా క్యూలైన్లు, మంచినీటి సదుపాయం, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలని, పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, ఎక్కడికక్కడ డస్ట్ బిన్లు ఏర్పాటు చేయాలన్నారు. పోలీసు శాఖ సూచనల మేరకు అవసర మైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు అమర్చాలని ఆలయ అధికారులను ఆదేశించారు.

ప్రసాదం కౌంటర్, క్యూలైన్ల వద్ద సరిపడా సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఎక్కడి కక్కడ సూచిక బోర్డులు, ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. అన్ని విభాగాల అధికారులతో ఆలయ సమీపంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్ అంతరాయం, భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సేవా సంఘాలు, ఎన్.ఎస్.ఎస్., వాలంటీర్లను వినియోగించుకొనే ప్రక్రియ పారదర్శకంగా ఉండాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్, జిల్లా రెవెన్యూ అధికారి వై సత్యనారాయణ రావు, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్ ఎన్ సుజాత, ఎండోమెంట్ డిస్ట్రిక్ట్ ఎగ్జిక్యూటివ్ అధికారి కేఎల్ సుధారాణి, ఆలయ ఈవో శ్రీధర్, పోలీస్, జీవీఎంసీ, ఫైర్ సర్వీస్, విద్యుత్ శాఖ, డిఎం అండ్ హెచ్ ఓ, విభాగాల జిల్లా స్థాయి అధికారులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నూకంబికను దర్శించుకున్న మాధవ్ దంపతులు

**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 13:**రాష్ట్ర పండగ, ఉత్తరాంధ్ర ఇలవేల్పు, గవరపాలెంలో వెలిసిన నూకంబిక అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం బిజెపి రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పివిఎన్ మాధవ దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆయనను ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆయనను దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), ఆలయ సహా కమిషనర్ యాళ్ళశ్రీధర్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదం ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా బిజెపి అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వర రావు, పొన్నగంటి అప్పారావు, ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవి కుమార్, పొలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి జానకి శ్రీనివాస రావు,
కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి పైడిరాజు, యర్రవరపు సంతోషి కుమారినాగేషి, తదితరులు పాల్గొన్నారు.





# దివ్యాంగులకు వీల్ చైర్, ట్రై సైకిలు పంపిణీ చేసిన సీతం రాజు సుధాకర్



**విశాఖపట్నం, పెన్ సత్తా, మార్చి 13:** దక్షిణ నియోజకవర్గం 35 వ వార్డు పరిధిలో వేలంపేట ప్రాంతంలో ఉంటున్న ఇద్దరు దివ్యాంగులకు ఒక వీల్ చైర్ ఒక ట్రై సైకిలు పంపిణీ చేయడం జరిగినది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశాఖ దక్షిణ నియోజకవర్గ ఇన్చార్జ్, ఎన్టీఆర్ రాష్ట్ర వైద్య సేవ చైర్మన్ సీతం రాజు సుధాకర్, 35 వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కర రావు చేతుల మీదుగా దివ్యాంగు లైన లబ్ధిదారులకు అందజేయడం జరిగినది. కార్యక్రమాన్ని నిర్వహించిన తెలుగు మహిళ నాయకురాలు చేరకం మణిమ్మ ఇటు వంటి సేవా కార్యక్రమాలు చేపట్టి లబ్ధిదారులకు ఎంతో ఉపయోగ పడాలని, అందుకు మా వంతు సహాయ సహకారాలు ఎప్పుడు ఉంటాయని సీతంరాజు సుధాకర్ అన్నారు. కార్యక్రమంలో 35 వ వార్డు ప్రధాన కార్యదర్శి బత్తి మంగరాజు, మహంతి గౌరీ శంకర్, ఇతర నాయకులు పాల్గొనడం జరిగినది.

# వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం, సింహాచలం.

## సింహగిరి పై భక్తుల కోసం సెల్ఫ్ సర్వీస్ కియోస్క్ లు ప్రారంభం.

**సింహాచలం, పెన్ సత్తా, మార్చి 13:** వరాహ లక్ష్మీనరసింహ స్వామి ని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల సౌకర్యార్థం సింహగిరి పై ఒక విప్లవాత్మక మార్పు చోటుచేసుకుంది. గంటల తరబడి క్యూ లైన్లలో వేచి చూసే అవసరం లేకుండా, అత్యాధునిక సాంకేతికతతో భక్తులకు దర్శన టికెట్లను మరింత సులభతరం చేస్తూ కియోస్క్ సెల్ఫ్ సర్వీస్ యంత్రాలను దేవస్థానం అందుబాటు లోకి తెచ్చింది. టికెట్ కౌంటర్ల వద్ద గంటల తరబడి వేచి ఉండాల్సిన అవసరం లేకుండా, భక్తులు నేరుగా ఈ యంత్రాల ద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి క్షణాల్లో దర్శన టికెట్లు పొందవచ్చు. సామాజిక బాధ్యతలో భాగంగా కరూర్ వైశ్యా బ్యాంక్ ఈ అత్యాధునిక మెషిన్లను దేవస్థానానికి విరాళంగా అందించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, కొండ పైన గల బస్టాండ్, పి ఆర్ ఓ కార్యాలం ఆవరణలో ఈ కియోస్క్ సెంటర్లను అందుబాటు లోకి తెచ్చారు. ఈ సందర్భంగా ఈఓ జె. వెంకట్రావు మాట్లాడుతూ సాంకేతికతను వినియోగించుకుని భక్తులకు ఒత్తిడి లేని, ప్రశాంత మైన దర్శన భాగ్యాన్ని కల్పించడమే మా లక్ష్యం అన్నారు. భవిష్యత్తులో భక్తుల సౌకర్యార్థం మరిన్ని వినూత్న డిజిటల్ సేవలను అందుబాటు లోకి తెస్తాం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కరూర్ వైశ్యా బ్యాంక్ ఉన్నతాధికారులు మురళీకృష్ణ ఎన్.డివిజనల్ మేనేజర్, మూర్తి హెచ్.ఎస్.ఎన్.వి.ఆర్.సీనియర్ మేనేజర్, పాల్గొన్నారు దేవస్థానం ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె. తిరుమలేశ్వర్రావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామరాజు ఇతర ఆలయ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తుల సమయాన్ని ఆదా చేస్తూ, ప్రశాంత మైన దర్శన భాగ్యాన్ని కల్పించడమే మా లక్ష్యం. సాంకేతికతను జోడించి స్వామివారి సేవలను మరింత చేరువ చేస్తున్నాం అన్నారు వెంకట్రావు.

సింహగిరికి విచ్చేసే భక్తులు ఈ డిజిటల్ సదుపాయాన్ని వినియోగించుకుని త్వరితగతిన స్వామివారి దర్శనం చేసుకోవాలని దేవస్థానం కోరుతోంది.







# కూటమి హయాంలో అభివృద్ధి కి పెద్ద పీట









**మాడుగుల, పెన్ సత్తా, మార్చి 13:**కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధి కి పెద్ద పీట వేస్తున్నామని వి.ఎం.ఆర్.డి.ఏ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ అన్నారు. మాడుగుల నియోజకవర్గం పరిధి లోని దేవరాపల్లి, కే కోటపాడు మండలాల్లో రూ 1.75 కోట్లతో పలు అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి, మెట్రోపాలిటన్ కమిషనర్ తేజ్ భరత్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు వి.ఎం.ఆర్.డి.ఏ పరిధిలో అన్ని శాసనసభ నియోజకవర్గాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే మాడుగుల నియోజకవర్గం పరిధి లోని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి సూచనలతో నియోజకవర్గం పరిధిలో సుమారు రూ 1.76 కోట్ల ను కేటాయించామని, అలానే ఇతర ప్రాంతాల అభివృద్ధి కి కూడా ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. దేవరాపల్లి లో సుమారు రూ.76 లక్షలతో 2 ఎకరాల విస్తీర్ణంలో అందరికి ప్రయోజనకరంగా ఉండేలా పార్క్ ను అభివృద్ధి చేశామన్నారు. పిల్లల కోసం ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నామని, అందుకే ఇక్కడ జాగింగ్ ట్రాక్ నిర్మాణం చేపట్టామని తెలిపారు. అలానే కే. కోటపాడు లో సామాజిక అవసరాల నిమిత్తం సుమారు కోటి రూపాయల వ్యయంతో కళ్యాణ మండలం అందుబాటు లోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ గ్రామీణ నియోజకవర్గ మైన మాడుగులకు వి.ఎం.ఆర్.డి.ఏ నుంచి అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడం మంచి శుభపరిణామమని పేర్కొన్నారు. ఇందుకు వి.ఎం.ఆర్.డి.ఏ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ కి, మెట్రోపాలిటన్ కమిషనర్ తేజ్ భరత్ కు నియోజకవర్గం ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. మెట్రోపాలిటన్ కమిషనర్ తేజ్ భరత్ మాట్లాడుతూ ధన సంపదతో పాటు, విజ్ఞాన సంపద కూడా అవసరమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పట్టణీకరణ దిశగా వి.ఎం.ఆర్.డి.ఏ ద్వారా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సూచనలతో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని, పార్క్ లని నిర్వహణ చాలా ముఖ్యమని, దీని పై స్థానిక సంస్థలు దృష్టి సారించాలని, పార్కు లు ఆర్థిక స్వయం ప్రతిపత్తి సాధించాలని సూచించారు. వి.ఎం.ఆర్.డి.ఏ తరుపున ప్రజా ప్రయోజన అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజినీర్ భవానీ శంకర్, డిఎఫ్ఓ శిరీష, కార్యనిర్వహక ఇంజనీర్ రాంబాబు, పలువురు స్థానిక నేతలు, అధికారులు పాల్గొన్నారు.

# పదవ తరగతి విద్యార్థులతో ముఖా ముఖిలో కలక్టర్ విజయ్ కృష్ణన్





**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 13:**పదవ తరగతి పరీక్షలు రానున్న తరుణంలో విద్యార్థులతో వీడియో కాన్ఫరెన్స్ ముఖా ముఖి కార్యమాన్ని కలక్టర్ విజయ్ కృష్ణన్ నిర్వహించారు. శుక్రవారం కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి కలెక్టర్ తగు సూచనలు ఇవ్వడం జరిగింది. ప్రతి పాఠశాలలో ప్రధానోపాద్యాయులు ఐ ఎఫ్ పి ప్యానల్ ద్వారా సుమారు 14,056 మంది విద్యార్థులతో పరీక్షల్లో భయం పోగొట్టే విధంగా తగుచూచనలు ఇవ్వడ మైంది. పరీక్షలు అంటే మనం నిత్యము రాస్తున్న పరీక్షలు మాత్రమేనని వారికి అబినందనలు తెలుపుతూ ఉత్తీర్ణతలో మన జిల్లా ను ముందంజలో ఉంచాలని తెలియజేశారు. కావున విద్యార్థులను ఎవరికి ఎటువంటి సందేహాలు వున్నా సంబంధిత ఉపాధ్యాయుని అడిగి నివృతి చేసుకొని పరీక్షలు రాయాలి అని తెలిపారు. ఈ కార్యక్రమములో సంయుక్త కలక్టర్ శౌర్య మన్ పటేల్, జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు, వివిధ ఉన్నత పాఠశాలల నుండి విద్యార్థిని, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లు అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు.

**జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్.**

**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 13:** ఇటీవల నెలకొన్న (యుద్ధం) పరిస్థితుల దృష్ట్యా గ్యాస్ సిలిండర్ల పంపిణీ, నిల్వలు, ధరల పై ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లు అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్ అన్నారు. శుక్రవారం ఉదయం ఆయన చాంబర్లో తాసిల్దార్లు, ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ గ్యాస్ సిలిండర్ల పంపిణీ, నిల్వలు, ధరల పై ప్రత్యేక దృష్టి పెట్టాలని తాసిల్దార్లను, అధికారులను ఆదేశించారు. గ్యాస్ కొరత ఉందనే ఆందోళనతో వినియోగదారులు ముందు గానే బుకింగ్ చేసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రతి డిస్ట్రిబ్యూటర్ కార్యాలయం వద్ద పానిక్ బుకింగ్స్ అవసరం లేదు అని స్పష్టంగా తెలిపే ఫ్లెక్సీలను తెలుగులో ప్రదర్శించాలన్నారు. బుక్ చేసిన 72 గంటల్లోనే గ్యాస్ సిలిండర్ డెలివరీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి గ్యాస్ ఏజెన్సీ వద్ద ఫోన్ నెంబర్లు, సేల్స్ ఆఫీసర్, సంబంధిత తాసిల్దార్ ఫోన్ నెంబర్లను ప్రజలకు అందుబాటులో ఉంచాలని, బిల్లులో ఉన్న ధర కంటే ఒక్క రూపాయి అదనంగా వసూలు చేసినా, లేదా టిప్స్ పేరుతో ఒత్తిడి చేసినా డెలివరీ బాయ్స్ పై, సదరు ఏజెన్సీల పై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఓటీపీ లేకుండా ఎక్కడా సిలిండర్ డెలివరీ చేయకూడదని, పారదర్శకత పాటించాలని సూచించారు. నిల్వలను అక్రమంగా దాచడం లేదా ఇతర అవసరాలకు మళ్లించడం వంటివి చేస్తే ఈసీ యాక్ట్ 1955 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, దీనికోసం సివిల్ సప్లైస్, తాసిల్దార్ బృందాలు నిరంతరం తనిఖీలు చేస్తాయని జాయింట్ కలెక్టర్ తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత డిస్ట్రిబ్యూటర్ల పై ఉందని, నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్సుల రద్దుకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు.



ఈ సమావేశంలో డీఎస్ఓ కే వి ఎల్ ఎన్ మూర్తి, కలెక్టరేట్ పరిపాలన అధికారి విజయ్ కుమార్, తాసిల్దార్లు, ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లు పాల్గొన్నారు.

# 12 వ కాలేజియేట్ స్పోర్ట్స్ మీట్ ను ప్రారంభించిన శాప్ చైర్మన్ రవి నాయుడు



**తాడేపల్లిగూడెం, పెన్ సత్తా, మార్చి 13:** స్థానిక డాక్టర్ వైయస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ లో నిర్వహిస్తున్న 12 వ ఇంటర్ కాలేజియేట్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ను శాప్ చైర్మన్ రవి నాయుడు, యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ కే ధనుంజయ రావు తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రవి నాయుడు మాట్లాడుతూ, ఇంటర్ కాలేజియేట్ స్పోర్ట్స్ మీట్‌ల నిర్వహణ ద్వారా కాలేజీల్లో చదువుతున్న క్రీడాకారుల ప్రతిభను వెలికితీయడానికి మంచి అవకాశం లభిస్తుందని అన్నారు. ఇటువంటి పోటీలు విద్యార్థుల్లో పోటీ తత్వం, క్రమశిక్షణ, క్రీడా స్ఫూర్తిని పెంపొందిస్తాయని తెలిపారు. అనంతరం అథ్లెటిక్స్ పోటీలలో విజయం సాధించిన క్రీడాకారులకు సర్టిఫికెట్లు, మెడల్స్‌ను అందజేశారు. ఈ పోటీలలో రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన 8 హార్టికల్చర్ కాలేజీలకు చెందిన 240 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ యూనివర్సిటీ సిబ్బంది, హార్టికల్చర్ కాలేజీల ఫిజికల్ డైరెక్టర్లు, విద్యార్థులు, శాప్ బోర్డ్ డైరెక్టర్ రవీంద్ర, ఏలూరు జిల్లా తెలుగు యువత సభ్యులు పాల్గొన్నారు.

# జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా కవయిత్రి మొల్ల జయంతి వేడుకలు.

**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 13:** జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రముఖ కవయిత్రి, అక్షర తపస్విని మొల్ల జయంతి వేడుకలను శుక్రవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొని, మొల్ల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహన రావు మాట్లాడుతూ సామాన్య కుటుంబంలో జన్మించిన మొల్ల తన అద్భుత ప్రతిభతో మొల్ల రామాయణాన్ని సామాన్యులకు సైతం అర్థమయ్యే అత్యంత సరళ మైన తెలుగులో రచించి చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు.

ఎటువంటి రాజపోషణ ఆశించకుండా, కేవలం భక్తితో ఆమె చేసిన అక్షర కృషి నేటి తరానికి, ముఖ్యంగా మహిళా సాధికారతకు గొప్ప స్ఫూర్తి అన్నారు.

తెలుగు జాతి గర్వించదగ్గ కవయిత్రిగా ఆమె విగ్రహాన్ని హైదరాబాద్ ట్యాంక్ బండ్ తో పాటు పలు ప్రధాన నగరాల్లో ప్రతిష్టించడం ఆమె గొప్పతనానికి నిదర్శనం. ఆమె పట్టుదల, సాహిత్య సేవను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో డీఎస్పీ జీ.ఆర్.ఆర్. మోహన్, ఇన్‌స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, బాల సూర్యారావు, సేనం రమేష్, దేవుళ్ళు, పిల్లా రమేష్, ఎస్సైలు ప్రసాద్, రమణయ్య, జిల్లా



పోలీసు కార్యాలయ సిబ్బంది పాల్గొని మొల్ల కి పుష్పాంజలి ఘటించారు.

# పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూకంబికకు పట్టు వస్త్రాలు సమర్పణ





**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 13:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో, జిల్లా పద్మశాలి సంఘం సభ్యులు ఉత్తరాంధ్ర ఇలవేల్పు నూకంబిక అమ్మవారి కి శుక్రవారం చీర సారే పట్టు వస్త్రాలు సమర్పించడం జరిగింది. అమ్మవారు నూతన విగ్రహావిష్కరణ జరిగిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర సంక్షేమ సంఘ అధ్యక్షులు జీవీ నాగేశ్వర రావు మాట్లాడుతూ ఎక్కడ అయితే వైష్ణవ దేవాలయాలు ఉన్నాయో అక్కడ పద్మశాలీలు చీర, సారే, పట్టు వస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తుందని అన్నారు. తిరుచానూరు పద్మావతి అమ్మవారికి, అలాగే మంగళగిరి లక్ష్మీనరసింహ స్వామి కి అహోబిలం, ఒంటిమిట్ట, నారాయణవనం తదితర ప్రాంతాల్లో అమ్మవారలకు పద్మశాలీలచే పట్టు వస్త్రాలు సమర్పించే క్రమంలో ఈ ప్రాంతంలో కొలువై ఉన్న నూకాంబిక అమ్మవారికి పట్టు వస్త్రాలు ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ఈ క్రియను ప్రతి సంవత్సరం కొనసాగిస్తామని ఈ సందర్భంగా చెప్పారు. అనకాపల్లి జిల్లా అధ్యక్షులు తిప్పాన అప్పారావు, గౌరవ అధ్యక్షులు పంపాన సత్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ దొడ్డి ఈశ్వరరావు, ఈ కార్యక్రమాన్ని ముందుండి నడిపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలో అనేక ప్రాంతాల నుంచి పద్మశాలీ కుటుంబీకులు పెద్ద ఎత్తున హాజరై 100 మంది దంపతులు పట్టు వస్త్రాలు, చీర సారే సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మెడికల్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ చైర్మన్ పెద్దలు చిల్లపల్లి శ్రీనివాసరావు, అలాగే మాజీ ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మీ ముత్యాల రావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కొప్పుల రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ బోర్డు సభ్యులు సూరిశెట్టి సూరిబాబు, బల్ల పరమేశ్వర రావు, యువత అధ్యక్షుడు సప్పా మణికంఠ, ఉత్తరాంధ్ర వాసులు కరణం వెంకటేశ్వర్లు, డా. కళ్యాణి, రాపర్తి సుబ్బారావు, సూరిశెట్టి రావాలి, గుద్దే వేణు, ప్రముఖ చేనేత నాయకులు పొన్నగంటి అప్పారావు, దేవస్థానం ఈవో అండ్ చైర్మన్, ఆలయ సిబ్బంది పూర్తిగా సహకరించి అందరికీ దర్శన భాగ్యం కల్పించారు వారికి పద్మశాలి రాష్ట్ర సంఘం తరపున, జిల్లా సంఘం తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నాము అన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), ఆలయ సహా కమిషనర్ యాళ్ళశ్రీధర్

ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవికుమార్ పొలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి జానకి శ్రీనివాసరావు,

కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి పైడిరాజు, యర్రవరపు సంతోషి కుమారినాగేష్, పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు డాక్టర్ గడ్డం దివ్యతేజ, కార్యదర్శి సూరిశెట్టి భావన ఋషి, కాకి పైడిరాజు, వైస్ ప్రెసిడెంట్ దొడ్డి సూరిబాబు, ట్రెజరర్ ఆకుల అప్పారావు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి

**ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాది శ్రీనివాస నాయుడు**

**నక్కపల్లి, పెన్ సత్తా, మార్చి 13 :** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల శాసన మండలి సభ్యులు డాక్టర్ గాదె శ్రీనివాసులు నాయుడు అన్నారు. శుక్రవారం నక్కపల్లి బాలికలు ఉన్నత పాఠశాలను సందర్శించి 10 వ తరగతి పరీక్షలు కు హాజరువుతున్న విద్యార్థులకు పలు సూచనలు,సలహాలు అందజేశారు. పది పరీక్షల్లో మంచి మార్కులు సాధించి భవిష్యత్తు లో ఉన్నత స్థానాలుకు చేరుకోవాలని ఆయన ఆశీస్సులు అందజేశారు. ఉపాధ్యాయులుకు మధ్యంతర భృతి ని ప్రకటించాలని, త్వరలో పి ఆర్ సి ని కూడా అమలు చేయాలని, సర్వీస్ రూల్స్ అమలుకు కృషి చేయాలని, పెండింగ్ లో ఉన్న డి ఎ లు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరడమైనది అన్నారు.ఈ కార్యక్రమం లో పి ఆర్ టి యు జిల్లా అధ్యక్షులు డి. గోపినాధ్, మండల శాఖ అధ్యక్షులు టి. వి. రమణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు ఎ. సత్యవతి, శేషగిరి,



గుణవతి తదితరులు పాల్గొన్నారు.

## మొల్ల కి నివాళులు అర్పించిన జాయింట్ కలెక్టర్



**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 13:** తెలుగు కవయిత్రి ఆతుకూరు మొల్ల మాంబ జయంతిని పురస్కరించు కొని ఆమె చిత్రపటానికి జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర తో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలుగు సాహిత్యానికి మొల్లమాంబ చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు.

తొలి తెలుగు మహిళా కవయిత్రి ఆతుకూరు మొల్లమాంబ జయంతి వేడుకలు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి వై సత్యనారాయణ రావు, బీసీ వెల్ఫేర్ అధికారి శ్రీదేవి, ఇతర అధికారులు, ప్రతినిధులు మొల్లమాంబ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

# ఏపీ ఎస్పీ లో హెడ్ కానిస్టేబుళ్లకు ప్రత్యేక పదోన్నతుల కల్పనలో లోకేష్ చొరవ.

- ప్రజాదర్బార్ లో మంత్రి లోకేష్ ను కలిసి విన్నవించిన సిబ్బంది.
- అసిస్టెంట్ రిజర్వ్ సబ్ ఇన్ స్పెక్టర్లుగా 300 మందికి పదోన్నతులు కల్పించిన కూటమి ప్రభుత్వం.
- అండగా నిలిచిన మంత్రి లోకేష్ కు కృతజ్ఞతలు తెలిపిన హెడ్ కానిస్టేబుళ్లు.



**అమరావతి, మార్చి 13:** సమస్య ఏదైనా తన దృష్టికి తీసుకువస్తే అండగా ఉంటానంటూ భరోసా ఇస్తున్నారు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్. ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న తమ పదోన్నతుల సమస్య పరిష్కరించాలంటూ ప్రజాదర్బార్ లో తనను కలిసి ఏపీ ఎస్పీ హెడ్ కానిస్టేబుళ్లు చేసిన విజ్ఞప్తి పట్ల మంత్రి లోకేష్ సానుకూలంగా స్పందించారు, వారికి అండగా నిలిచారు. మంత్రి లోకేష్ చొరవతో ఏపీ ఎస్పీ లో హెడ్ కానిస్టేబుల్ నుంచి అసిస్టెంట్ రిజర్వ్ సబ్ ఇన్ స్పెక్టర్లుగా(ఏఆర్ఎస్ఐ)

300 మందికి పదోన్నతులు కల్పిస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పోలీస్ శాఖ లోని సివిల్, ఏఆర్, ఏపీఎస్పీ సిబ్బందికి పదోన్నతులు కల్పిస్తూ 2014–19 మధ్య ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అయితే కొన్ని సాంకేతిక కారణాలు, ఎన్నికల నియమావళి అమలు లోకి రావడంతో ఏపీఎస్పీ సిబ్బందికి మాత్రం పదోన్నతులు నిలిచిపోయాయి. ఆ తర్వాత వచ్చిన జగన్ రెడ్డి ప్రభుత్వానికి విన్నవించినప్పటికీ స్పందన లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజాదర్బార్ లో మంత్రి నారా లోకేష్ ను కలిసిన సిబ్బంది, తమ సమస్య పరిష్కరించాలంటూ విన్నవించారు. అండగా ఉంటామంటూ మంత్రి హామీ ఇచ్చారు. దీంతో ఇచ్చిన మాట నిలుపుకుంటూ పదోన్నతుల ప్రక్రియను ప్రారంభించి అమలులో చొరవ చూపారు. పదోన్నతులు కల్పించి 300 మంది కుటుంబాల్లో ఆనందం నింపడం పట్ల ఏపీఎస్పీ పోలీసు సిబ్బంది మంత్రి లోకేష్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## మహిళా జన సున్వాయి వినతుల స్వీకరణ కార్యక్రమం.








**విశాఖపట్నం, పెన్ సత్తా, మార్చి 13:**విశాఖపట్నం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ప్రారంభ మైన మహిళా జన సున్వాయి వినతుల స్వీకరణ కార్యక్రమం. బాధిత మహిళల నుంచి వినతులు స్వీకరిస్తూ విచారణ చేస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్పర్సన్ రాయపాటి శైలజ.

భాగస్వామ్య మైన స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీ రామలక్ష్మి, అనకాపల్లి పీడీ సూర్యలక్ష్మి, ఏసీపీలు నరసింహ మూర్తి, లక్ష్మణ మూర్తి, చిట్టిబాబు, శ్రావణి (అనకాపల్లి), విశాఖపట్నం, విజయనగరం, అనకాపల్లి జిల్లాలకు చెందిన లీగల్ సర్వీసెస్, ఐసీడీఎస్ అధికారులు తదితరులు.

## ఏఎంఏఎల్ కళాశాలలో మెగా జాబ్ మేళా.




**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 13:** మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఏఎంఏఎల్ కళాశాలలో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, అనకాపల్లి ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించబడింది. ఈ జాబ్ మేళాకు సుమారు 18 కంపెనీల ప్రతినిధులు హాజరై, 375 మందిని ఇంటర్వ్యూ చేయగా, 127 మంది ఉద్యోగాలకు సెలెక్ట్ అవ్వడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని కళాశాల కరస్పాండెంట్ పెంటకోట వెంకట రామారావు, అనకాపల్లి జిల్లా స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎన్. గోవిందరావు కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కష్టే ఫలి అన్నట్లుగా ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేస్తే ఆ కంపెనీ అభివృద్ధి చెందడమే కాక ఆ అభివృద్ధిని ఉద్యోగికి కూడా పంచుతుందని, ఉద్యోగంలో ఎదుగుదల కనిపిస్తుందని అన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరు కష్టపడి పని చేయాలని తద్వారా ఫలితాన్ని ఆశించాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టీ. నిరంజన్ కుమార్, సూపరింటెండెంట్ పి. అనురాధ, స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఉద్యోగులు పి. శ్రీనివాసరావు డిస్ట్రిక్ట్ ప్లేస్మెంట్ ఆఫీసర్, టీ. చంద్ర గణేష్ హెచ్ ఆర్ ఎం ఐ ఎస్, ఏ. చక్రవర్తి స్కిల్ కో ఆర్డినేటర్, మందపల్లి శివ నాన్ టెక్నికల్ ఆఫీసర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యోగులు, కాంట్రాక్ట్ వర్కర్లలకు హీట్ వేవ్ జాగ్రత్తలు, స్ట్రోక్ పై అవగాహన.

**పరవాడ, పెన్ సత్తా, మార్చి 13:**ప్రస్తుతం కొనసాగుతున్న అధిక ఉష్ణోగ్రతలు, హీట్ వేవ్ పరిస్థితుల నేపథ్యంలో ఫార్మాస్యూటికల్ పరిశ్రమల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కాంట్రాక్ట్ వర్కర్ల ఆరోగ్య భద్రత పై అవగాహన కల్పించేందుకు జేఎన్పిసి మానుఫాక్చరర్స్ అసోసియేషన్, ఎంఎఎస్ఆర్ఎం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం జేఎన్ ఫార్మా సిటీ పరిధి లోని పరిశ్రమల ఈహెచ్ఎస్, హెచ్ఆర్ విభాగాల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా
వాడపల్లి సురేష్ (డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ విశాఖపట్నం),
కె. వీరభద్ర రావు (డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ బాయిలర్స్ విశాఖపట్నం రీజియన్),
పి.వి. ముకుంద రావు (ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ – ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, విశాఖపట్నం), పి.కె.పి. ప్రసాద్(జనరల్ మేనేజర్ జిల్లా పరిశ్రమల కేంద్రం (డిఐసి) అనకాపల్లి), ఆర్. వెంకట రమణ (డిప్యూటీ చీఫ్ ఫైర్ ఆఫీసర్ అనకాపల్లి), జెట్టి సుబ్బారావు – సెక్రటరీ ఆఫ్ జేఎన్పిసి మానుఫాక్చరర్స్ అసోసియేషన్ పాల్గొన్నారు.
సమావేశంలో ప్రస్తుతం కొనసాగుతున్న హీట్ వేవ్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు, కాంట్రాక్ట్ వర్కర్ల ఆరోగ్యాన్ని కాపాడేందుకు యాజమాన్యాలు పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.
హీట్ వేవ్ సమయంలో ఉద్యోగులు డీహైడ్రేషన్, హీట్ స్ట్రెస్ సమస్యలకు గురయ్యే అవకాశం ఉన్నందున అన్ని విభాగాలలో పనిచేసే సిబ్బంది తరచుగా నీరు, మజ్జిగ, గ్లూకోజ్ నీరు వంటి ద్రవాలను తాగాలని సూచించారు.
మధ్యాహ్నా సమయంలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉండే కారణంగా అవసరం లేని బయటి పనులను నివారించాలని, తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే బయట పనులు చేయాలని తెలిపారు. బయట పని చేసే సమయంలో తలకు హెల్మెట్ లేదా టోపీ ధరించడం, నీడలో విశ్రాంతి తీసుకోవడం వంటి జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అదే విధంగా యూనిట్లో పనిచేసే ఉద్యోగులకు తలనొప్పి, తల తిరగడం, అధిక చెమటలు, అలసట వంటి హీట్ స్ట్రెస్ లక్షణాలు కనిపించిన వెంటనే తమ సూపర్వైజర్ లేదా మెడికల్ టీమ్కు సమాచారం అందించాలని కోరారు. అదే సమావేశంలో "స్ట్రోక్ అవేర్నెస్ ఎర్లీ యాక్షన్ సేవ్స్ లివ్స్ అనే అంశం పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా
డాక్టర్ కార్తిక్ కొల్లూరు (కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్, కిమ్స్ ఐకాన్ హాస్పిటల్), పాల్గొని స్ట్రోక్ లక్షణాలు, ముందస్తు జాగ్రత్తలు అత్యవసర సమయంలో వెంటనే వైద్య సహాయం పొందాల్సిన అవసరం పై వివరించారు. అన్ని ఉద్యోగుల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచు కొని పరిశ్రమల సేఫ్టీ విభాగం, యాజమాన్యాలు అవసర మైన చర్యలు తీసుకుంటున్నాయని తెలిపారు. ఉద్యోగులు అందరూ సేఫ్టీ సూచనలు పాటిస్తూ ఆరోగ్యంగా, భద్రంగా పనిచేయాలని సమావేశంలో పాల్గొన్న అధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జేఎన్ ఫార్మా సిటీ పరిధి లోని వివిధ ఫార్మాస్యూటికల్ పరిశ్రమల ఈహెచ్ఎస్, హెచ్ఆర్ విభాగాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాస్తే అద్భుత ఫలితాలు

- ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు ఎం.ఏ.రజాక్



**నక్కపల్లి, పెన్ సత్తా, మార్చి13:** పరీక్షలను ఆత్మవిశ్వాసంతో వ్రాస్తే అద్భుత ఫలితాలను సాధించవచ్చని వ్యక్తిత్వ వికాస నిపుణులు ఎం ఏ రజాక్ అన్నారు. శుక్రవారం పెదబోదిగల్లం హైస్కూల్లో విద్యార్థులను ఉద్దేశించి పలు సూచనలు సలహాలు అందజేశారు. పదవతరగతి పరీక్షలను ప్రతి విద్యార్థి ఆత్మ విశ్వాసంతో ధైర్యంగా పరీక్షలు రాయాలని విద్యార్థులకు సూచించారు. స్ఫూర్తిదాయకమైన సందేశాన్ని వివరిస్తూ చదివిన అంశాలను ఎక్కువగా పునశ్చరణ చేయాలని అన్నారు. ఏకాగ్రత అలవరచుకుంటూ ,ప్రణాళికా యుతంగా చదివితే అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులందరికీ పరీక్షా సామగ్రిని ఆయన ఆర్థిక సహకారంతో అందించారు. ఉపాధ్యాయులను ఆయన చేతుల మీదుగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్.ఆచార్యులు, ఎస్.పాల్గుణరావు, ఎ.వి.ఎల్.ఎన్. కుమారి, రమేష్ బాబు, దవరశింగి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# బంగారు పిచ్చుకల పరి రక్షణకు కృషి చేయాలి





- పిచ్చుకలు గూడు పెట్టె గడ్డి ని కాపాడుకోవాలి
- పశుపక్ష్యాదులు కోసం నీరు అందుబాటులో ఉంచాలి
- కలుపు తీత రసాయనాలు నిషేధించాలి
- జెవి రత్నం, వ్యవస్థాపక కార్యదర్శి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ

**సబ్బవరం, పెన్ సత్తా, మార్చి 13:**బంగారు పిచ్చుకల పరి రక్షణకు కృషి చేయాలి అని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం సబ్బవరం మండలం లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల విద్యా సంస్థలో గ్రీన్ క్లైమేట్ టీం, పీపుల్స్ పవర్ ఎన్జీఓలతొ కలిసి ప్రిన్సిపాల్ సి హెచ్ కేశవరావు అధ్యక్షతన నిర్వహించిన పిచ్చుకల పరి రక్షణ కార్యక్రమంలో ముందుగా విద్యార్థులు బంగారు పిచ్చుకలను చూడటానికి పొలాల్లోకి వెళ్లి పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమావేసంలో ఆయన మాట్లాడారు. బంగారు పిచ్చుకలు పంటలను ఆశించిన క్రిమి, కీటకాలను ఆహారంగా తీసుకుని పంటలకు, తద్వారా మానవాళికి ఉపకరిస్తాయి అన్నారు. అలాగే పిచ్చుకలు గూడు పెట్టె గడ్డి ని కాపాడు కోవాలి అని వివరించారు. రసాయన క్రిమి సంహారక మందులు, రసాయన కలుపు తీత మందులు బంగారు పిచ్చుకలకు మరణానికి కారణం అయ్యాయి అని పేర్కొన్నారు. అందకే ముందుగా రసాయన కలుపు తీత మందులు నిషేధించాలి అని ప్రభుత్వాన్ని కోరారు. అలాగె పశుపక్ష్యాదులు కోసం నీరు అందుబాటులో ఉంచాలన్నారు. సమస్త జీవరాశినీ కాపాడుకోవాలి అని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సి హెచ్ కేశవరావు మాట్లాడుతూ విద్యార్థులు అందరూ పర్యావరణ హితంగా జీవించాలి అని కోరారు. తమ విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ, మొక్కలు పెంచడం కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగుతోంది అన్నారు. గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ ఇచ్చిన పర్యావరణ దినోత్సవాల కాలమానిని ఆధారంగా పర్యావరణ దినోత్సవాలు నిర్వహించుతామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డాక్టర్ పి రాంబాబు, పీపుల్స్ పవర్ సంస్థ ప్రతినిధి నిమ్మకాయల భాస్కర్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించిన కూటమి నాయకులు





**నక్కపల్లి, పెన్ సత్తా, మార్చి 13 :**నక్కపల్లి మండలంలో పలు గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణానికి శుక్రవారం కూటమి నాయకులు కొబ్బరికాయలు కొట్టి పనులు ప్రారంభించారు. ఉపమాక శివారు సారిపల్లిపాలెంలో 6 రోడ్లుకు రూ 25లక్షలు మంజూరు కాగా నక్కపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి సిసి రోడ్లు నిర్మాణపు పనులు ప్రారంభించారు. ఉద్దండ పురంలో పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ కొబ్బరికాయ కొట్టి సీసీ రోడ్డు ప్రారంభించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణానికి ప్రత్యేకంగా దృష్టి సారించి నిధులు మంజూరు చేయించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనితకు ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు వెలగా సుధాకర్, ప్రగడ వీరబాబు, కొప్పిశెట్టి శ్రీను, నాయకులు ఎలమంచిలి రమణబాబు, ఎలమంచిలి జోగారావు, నాగబాబు,తోలేటి శ్రీను, కొప్పిశెట్టి వాసు, వెంకటప్పారావు జనసేన నాయకులు ఎలమంచిలి చంద్రరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# బాపట్లను బాల కార్మిక రహిత జిల్లాగా చేయాలి -బాపట్ల డీఆర్ఓ జీ గంగాధర్ గౌడ్

**బాపట్ల,పెన్ సత్తా,మార్చి 13 :**బాపట్ల జిల్లాను బాల కార్మిక రహిత జిల్లాగా చేయాలని బాపట్ల డీఆర్ఓ జీ గంగాధర్ గౌడ్ తెలిపారు.బాల కార్మిక నిర్మూలన వ్యవస్థ జిల్లాస్థాయి కమిటీ సమావేశం శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లో జరిగింది.బాల కార్మికులను నిర్మూలించడానికి ప్రభుత్వం నియమించిన జిల్లాస్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులు బాధ్యతతో పనిచేయాలని డీఆర్ఓ చెప్పారు.జిల్లాలో బాల కార్మికులు లేకుండా చేయాలన్నారు.14 సంవత్సరాల లోపు పిల్లలందరూ ఖచ్చితంగా పాఠశాలల్లోనే ఉండాలన్నారు.ముఖ్యంగా పరిశ్రమలు,ఇటుక బట్టీలు,హోటల్స్,దాబాల వద్ద ముమ్మరంగా తనిఖీలు చేయాలన్నారు.పట్టణ ప్రాంతాలలోను దుకాణాలు,వాణిజ్య సముదాయాలలో మునిసిపల్ కమీషనర్ లు తనిఖీలు చేపట్టాలని అన్నారు.గడిచిన రెండు నెలల్లో 2 కేసులు నమోదు కావడంతో బాలలను పాఠశాలల్లో చేర్పించాలన్నారు.అధికారులు సమర్ధంగా పనిచేస్తే మంచి ఫలితాలు లభిస్తాయని వివరించారు.ఈ సమావేశంలో కార్మిక శాఖ సహాయ కమీషనర్ వెంకట శివప్రసాద్,డీపీఓ ప్రభాకరరావు,డీఆర్డీఏ పీడీ బి సింగయ్య,డ్వామా పీడీ విజయలక్ష్మి,కమిటీలోని వివిధ శాఖల జిల్లా అధికారులు,వీక్షణ సమావేశం ద్వారా ఎంపీడీఓలు,తదితరులు పాల్గొన్నారు.



# హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ లిసా గిల్

ప్రమాణం చేయించనున్న జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్.
ఏపీ హైకోర్టు తొలి మహిళా ప్రధాన న్యాయ మూర్తిగా చరిత్ర.

**అమరావతి, మార్చి 13:**ఏపీ హైకోర్టు న్యాయ మూర్తిగా జస్టిస్ లీసా గిల్ నేడు ప్రమాణస్వీకారం చేయనున్నారు. హైకోర్టు లోని మొదటి కోర్టు హాలులో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్సింగ్ ఠాకూర్ జస్టిస్ లీసాగిల్ ఉదయం 10.15 నిమిషాలకు ప్రమాణం చేయించనున్నారు. పంజాబ్-హరియాణా ఉమ్మడి హైకోర్టు నుంచి బదిలీ పై వస్తున్న జస్టిస్ లీసాగిల్ ఇక్కడ రెండోస్థానంలో కొనసాగుతారు. ఇటీవల సుప్రీంకోర్టు కొలీజియం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల నియామకం విషయంలో ముఖ్యమైన విధానపర మైన నిర్ణయం తీసు కుంది. న్యాయ పరిపాలనలో సామర్థ్యాన్ని, నాణ్యతను మరింత బలో పేతం చేయడానికి చీఫ్ జస్టిస్(సీజే) కాబోయే న్యాయమూర్తిని ఆ పదవికి ఖాళీ ఏర్పడడానికి రెండు నెలల ముందే సంబంధిత కోర్టుకు బదిలీ చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా పంజాబ్-హరియాణా ఉమ్మడి హైకోర్టులో మూడోస్థానంలో ఉన్న జస్టిస్ లీసాగిల్ ను ఏపీ హైకోర్టుకు బదిలీ చేయాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఈ బదిలీకి రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ఆమోదముద్ర వేసిన విషయం తెలిసిందే. కాగా, ఏపీ హైకోర్టులో 37 మంది జడ్జీల నియామకానికి ఆమోదం ఉండగా ప్రస్తుతం జస్టిస్ లీసా గిల్ చేరికతో ఈ సంఖ్య 34 కి చేరనుంది. ప్రస్తుత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్సింగ్ ఠాకూర్ ఏప్రిల్ 24 న పదవీ విరమణ చేయనుండగా, ఆ వెంటనే సీజేగా జస్టిస్ లీసా గిల్ బాధ్యతలు చేపడతారు. ఈ నియామకం ద్వారా ఏపీ హైకోర్టు మొదటి మహిళా ప్రధాన న్యాయ మూర్తి గా ఆమె చరిత్రకెక్కనున్నారు.




# అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ మూడో విడత పంపిణీలో సుందరపు





**మునగపాక, పెన్ సత్తా, మార్చి 13:** మండల కేంద్రంలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ మూడో విడత పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో
నియోజకవర్గ శాసనసభ్యులు సుందరపు విజయ కుమార్, రాష్ట్ర రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నాగేశ్వరరావు ముఖ్య అతిదులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో వీరు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ మూడో విడత లో ప్రధాని నరేంద్ర మోదీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ఆరువేల రూపాయలు విడుదల చేశారన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు అండ దండగా ఉంటుందని, రైతులకు ఎల్లప్పుడూ స్నేహపూర్వక వాతావరణం లో కూటమి ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. గత ప్రభుత్వ మాదిరిగా పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్టు కాకుండా రైతులకు మేలు చేసే విధంగా పనిచేస్తుందని, ఎందు కంటే ఈ ప్రభుత్వం హయాంలో రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అనుసంధానం చేసి, రైతులకు మేలు చేస్తున్నామని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువ నాయకులు నారా లోకేష్ రాష్ట్ర అభివృద్ధి విషయంలో రాత్రి పగలను తేడా లేకుండా నిరంతరం కృషి చేస్తున్నారని, భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# కేకేఆర్‌లోకి జింబాబ్వే పేసర్.. ముస్తాఫిజూర్ స్థానంలో కొత్త ఆటగాడు




ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌కు ముందు కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) తమ జట్టులో కీలక మార్పు చేసింది. బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను రిలీజ్ చేసి, అతడి స్థానంలో జింబాబ్వే స్టార్ పేసర్ బ్లెస్సింగ్ ముజారబానీతో ఒప్పందం కుదుర్చుకుంది. మార్చి 17న ముజారబానీ కోల్‌కతాలోని జట్టు క్యాంపులో చేరనున్నాడు.6 అడుగుల 8 అంగుళాల ఎత్తున్న ఈ జింబాబ్వే రైట్ ఆర్మ్ ఫాస్ట్ బౌలర్ తన ఎత్తుకు తగ్గట్టే బౌన్స్‌తో బ్యాటర్లను ఇబ్బంది పెట్టడంలో సిద్ధహస్తుడు. ఇటీవల ముగిసిన టీ20 ప్రపంచకప్ 2026లో అద్భుతంగా రాణించాడు. టోర్నీలో మొత్తం 13 వికెట్లు పడగొట్టి, అత్యధిక వికెట్లు తీసిన నాలుగో బౌలర్‌గా నిలిచాడు. ఆస్ట్రేలియా, శ్రీలంక వంటి జట్లపై మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శనలు చేశాడు. ఐపీఎల్ అవకాశం కోసం పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్‌ఎల్) నుంచి కూడా వైదొలిగాడు. గత సీజన్‌లో అతను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు టైటిల్ గెలిచిన జట్టులో ఉన్నప్పటికీ, ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు.మరోవైపు, బంగ్లాదేశ్‌లో హిందూ సమాజంపై జరిగిన దాడుల నేపథ్యంలో చెలరేగిన వివాదం కారణంగా బీసీసీఐ సూచనల మేరకు కేకేఆర్ యాజమాన్యం ముస్తాఫిజుర్ రెహమాన్‌ను జట్టు నుంచి విడుదల చేసింది. డిసెంబర్ మినీ వేలంలో కేకేఆర్ అతడిని రూ. 9.20 కోట్లకు కొనుగోలు చేసింది. ఇది ఐపీఎల్ చరిత్రలో ఒక బంగ్లాదేశ్ ఆటగాడికి లభించిన అత్యధిక ధర కావడం గమనార్హం.ముస్తాఫిజుర్ స్థానంలో జట్టులోకి వచ్చిన ముజారబానీ, తన ప్రస్తుత ఫామ్, ఉపఖండ పిచ్‌లపై అనుభవంతో మూడుసార్లు ఛాంపియన్ అయిన కేకేఆర్ పేస్ బౌలింగ్ విభాగానికి మరింత బలం చేకూర్చగలడని ఫ్రాంచైజీ ఒక ప్రకటనలో పేర్కొంది.

# సంజు శాంసన్ అగ్రెసివ్ బ్యాటింగ్.. CSK కప్ కొట్టడం ఖాయం





త్వరలో ప్రారంభమయ్యే ఐపీఎల్‌లో తన 6వ టైటిల్ కోసం చెన్నై సూపర్ కింగ్స్ సిద్ధమవుతోంది. ఈ సీజన్‌లో సంజూ శాంసన్ జట్టులో చేరడంతో జూఖ బ్యాటింగ్ మరింత బలపడింది. దీనిపై మాజీ క్రికెటర్ పియుష్ చావ్లా మాట్లాడుతూ.. చెన్నై జట్టుకి ఉన్న ఓపెనింగ్ సమస్య సంజు శాంసన్ ఎంట్రీతో పోయాయి.. శాంసన్ మ్యాచ్ విన్నర్.. టీ20 వరల్డ్ కప్‌లో వెస్ట్ ఇండీస్, ఇంగ్లాండ్, న్యూజిలాండ్ పై మూడు మ్యాచుల్లో అతడు అద్భుతమైన ఇన్నింగ్స్‌లు ఆడారని అభినందించారు. ఐపీఎల్ ప్రారంభానికి అతడు ఫారమ్‌లో ఉండటం.. ఇది జూఖ అభిమానులకు శుభవార్త.. చెన్నై పిచ్ బ్యాటింగ్‌కి అనుకూలంగా ఉంటుంది.. ఓపెనింగ్‌లోనే ఆగ్రెసివ్ బ్యాటింగ్ జూఖకు చాలా ఉపయోగకరంగా మారనుందని చెప్పుకొచ్చారు. తమ చెన్నై సూపర్ కింగ్స్ జట్టు గత సీజన్‌లో పవర్ ప్లేలోనే త్వరగా వికెట్లు కోల్పోయి.. స్ట్రగుల్ అయ్యిందని పీయూష్ చావ్లా పేర్కొన్నారు. ఆయుష్ మత్రే లాంటి యంగ్ క్రికెటర్లు రావటంతో జూఖ పరుగులు చేయడం మొదలెట్టింది.. ఇప్పుడు ఆ జట్టులో శాంసన్ ఉండటంతో ఓపెనింగ్ లోనే బ్లాక్‌బస్టర్ ట్రేడ్‌గా ఉంటుందన్నారు. రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్‌గా చెన్నై సూపర్ కింగ్స్ గత సీజన్‌లో పాయింట్స్ పట్టికలో చివరగా నిలిచింది. అయినప్పటికీ, మినీ ఆక్షన్‌లో అద్భుతమైన ప్లేయర్స్ ని తీసుకుని జట్టుని బలమైన స్క్వాడ్ గా సిద్దం చేసుకుంది.. 6వ టైటిల్ గెలుచుకోవాలనే ఆత్మవిశ్వాసంతో ఈసారి బరిలోకి దిగుతుందని వెల్లడించారు. మాజీ భారత ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ మాట్లాడుతూ.. సంజు శాంసన్ చెన్నై జట్టులో చేరవడంతో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ మీద ఒత్తిడి తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. అలాగే మీా ధోనీ వారసత్వాన్ని కొనసాగిస్తూ ఖూాలో కెప్టెన్సీ చేయడం సులభం కాదు.. కానీ ధోనీ మద్దతు, శాంసన్ సహాయంతో రుతురాజ్‌కు చాలా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. జూఖ యువ ఆటగాళ్లను కూడా తీసుకుని భవిష్యత్తు కోసం వారిని సిద్ధం చేస్తుందన్నారు. జట్టులో డేవాల్డ్ బ్రెవిస్, ఊర్విల్ పటేల్, శివం దూబే, సర్ఫరాజ్ ఖాన్ వంటి ఎక్సైటింగ్ ప్లేయర్స్ కూడా ఉన్నారు.. వారు ఈ సీజన్‌లో ఎలాంటి ప్రదర్శన చేస్తారో చూడాలని పఠాన్ చెప్పుకొచ్చారు.

# ధోనీని మ్యాచ్ నుంచి పక్కన పెడుతున్నామని చెప్పే దమ్ముందా?



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 ఎడిషన్ ప్రారంభానికి మరో రెండు వారాలు మాత్రమే సమయం ఉంది. ఈ లీగ్ లో చెన్నై సూపర్ కింగ్స్ మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ ఏ పాత్ర పోషిస్తాడనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. సీఎస్కే తన తొలి మ్యాచ్ లో మార్చి 30వ తేదీన రాజస్థాన్ రాయల్స్ జట్టుతో తలపడనుంది. ఇప్పటికే చెన్నై టీమ్ యువ క్రికెటర్లు ప్రాక్టీస్ ని కూడా స్టార్ట్ చేశారు. ధోని కూడా నెట్స్ లో శ్రమిస్తున్న వీడియోలను సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ క్రమంలో సీఎస్కే మాజీ ప్లేయర్ సుబ్రమణియన్ బద్రినాథ్ మాట్లాడుతూ.. ధోని పాత్ర గురించి మేనేజ్మెంట్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో అనేది ఆసక్తికరంగా ఉందన్నారు. ఎంఎస్ ధోని అన్ని మ్యాచులను ఆడేందుకు సిద్ధంగా ఉన్నాడని చెన్నై సూపర్ కింగ్స్ సీఈవో కాశీ విశ్వనాథన్ చెప్పడం అడ్మినిస్ట్రేటివ్ నిర్ణయమో కాదో తెలియదని మాజీ క్రికెటర్ బద్రినాథ్ పేర్కొన్నారు. క్రికెట్ పరంగా ఏం నిర్ణయం తీసుకున్నా సపోర్టు చేస్తామన్నారు. ధోని దగ్గరకు హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ వెళ్లి .. నువ్వు ఇంపాక్ట్ ప్లేయర్ గా లేదా ఈ మ్యాచ్ లో నిన్ను పక్కన తప్పిస్తున్నాం అని చెప్పే దమ్ము ఉందా అని ప్రశ్నించాడు. అది సాధ్యం కూడా కాదు.. ఫ్లెమింగ్ మాత్రమే కాదు సీఎస్కేలో ఎవరూ అలా చెప్పడానికి సహసం చేయలేరు.. అక్కడ ఉన్నది ధోని ఈ సీజన్లోని అన్ని మ్యాచులనూ ఆడతాడని తెలిపారు. ధోని కూడా మంచి ఫిట్ గా కనిపిస్తున్నాడు. ఐపీఎల్లో ఆడేందుకు ఎంతో ఆసక్తిగా వేచి చూస్తున్నాడు. ఎలాంటి పాత్ర పోషిస్తాడనేది ఇప్పుడు అందరిలోనూ ఆసక్తి కలిగిస్తోందని బద్రినాథ్ వెల్లడించాడు.రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు 18 ఏళ్లలో ఒకే ఒక్కసారి కప్ ని కైవసం చేసుకుంది. సీఎస్కే మాత్రం 5 టైటిళ్లను దక్కించుకుంది. కాబట్టి, ఇరు జట్ల మధ్య 'పోటీ' ఉంటుందని నేను అనుకోవడం లేదని బద్రీనాథ్ చెప్పుకొచ్చారు. ఇటీవల జరిగిన మ్యాచుల్లో మాత్రం సీఎస్కేపై ఆర్సీబీ గెలిచింది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో చెన్నై కింగ్స్ ఓడిపోయింది. సీఎస్కే తన సామర్థ్యం మేరకు అత్యుత్తమ క్రికెట్ ఆడటం లేదని పేర్కొన్నారు. అందుకే, ఈ సీజన్లో ఇరు జట్ల మధ్య జరగబోయే మ్యాచ్ కోసం వేచి చూస్తున్నా" అని బద్రినాథ్ తెలిపాడు.

# లార్డ్ మార్కో' లో టాలీవుడ్ స్టార్!



హనీఫ్ అదేనీ దర్శకత్వంలో తెరకెక్కిన మాలీవుడ్ చిత్రం –మార్కో– ఎంత పెద్ద విజయం సాధించిందో తెలిసిందే. భారీ యాక్షన్ ఎంటర్ టైనర్ చిత్రంగా తెరకెక్కిన చిత్రం ఏ సర్టిఫికెట్ చిత్రంగా రిలీజ్ అయి ఇండియన్ సినిమా హిస్టరీ లోనే సరికొత్త చరిత్ర సృష్టించింది. ఈ స్థాయి హింసాత్మక చిత్రం రావడం అదే తొలిసారి. భారీ హింస.. రక్తపాతం తో ఒళ్లు గగుర్లు పొడిచే సన్నివేశాలెన్నో ఉన్నాయి. క్లైమాక్స్ లోనే ఈ కథకు ఇంకా కొనసాగింపు ఉంటుందని అర్దమైంది. దీంతో –మార్కో 2– ఎప్పుడు ఉంటుందని యాక్షన్ ప్రియులంతా నెట్టింట అడుగుతున్నారు.తాజాగా ఈ సినిమాకు సీక్వెల్ గా –లార్డ్ మార్కో– కూడా రెడీ అవుతోంది. –మార్కో–ని ఎక్కడ నుంచి ముగించారో –లార్డ్ మార్కో– అక్కడ నుంచే మొదలవుతుంది. ఇందులో ఉన్నిముకుందన్ మార్కో డి పీటర్ (మార్కో జూనియర్) పాత్రలో నటించాడు. యుక్తి తరేజా అనే మరియా అనే పాత్రలో హీరోయిన్‌గా కనిపించింది. సిద్ధిఖ్ జార్జ్ డి పీటర్ (అడాట్టు జార్జ్ పాత్రలో అలరించగా, జగదీష్ టోనీ ఐజాక్ పాత్రలో ఆకట్టుకున్నాడు. ఇంకా కబీర్ దుహాన్ సింగ్ సైరస్ ఐజాక్ పాత్రలో (విలన్) లో అదరగొట్టాడు. అభిమన్యు శమ్మి తిలకన్ రస్సెల్ ఐజాక్ పాత్రలో నటించాడు.అన్సన్ పాల్ దేవరాజ్ (దేవ్) పాత్రలో, ఇషాన్ శౌకత్ విక్టర్ డి పీటర్ (హీరో తమ్ముడి) పాత్రలోనూ ఆద్యంతం ఆకట్టుకున్నారు. ఈ పాత్రలన్నీ లార్డ్ మార్కోలో కొనసాగింపు కొనసాగుతాయి. వీటితో పాటు అదనంగా మరికొన్ని పాత్రలు యాడ్ అవుతాయి. అయితే ఇందులో ఓ తెలుగు హీరో కూడా నటిస్తున్నాడనే ప్రచారం జరుగుతోంది. పాన్ ఇండియాలో రిలీజ్ చేస్తున్న నేపథ్యంలో ఓ తెలుగు హీరోను పెట్టుకుంటే మార్కెట్ పరంగా మరింత కలిసొస్తుంది. దీనిలో భాగంగా యూత్ స్టార్ నితిన్ ని నిరంగంలోకి దించుతున్నారుట. ఓ కీలక పాత్రలో నితిన్ నటించే అవకాశాలున్నాయం టున్నారు.అదే జరిగితే నితిన్ కెరీర్ కొత్త టర్నింగ్ తీసుకుంటుంది. కొంత కాలంగా నితిన్ కు సక్సెస్ లు లేని సంగతి తెలిసిందే. ఏ సినిమా చేసినా నష్టాలు తప్ప రూపాయి లాభం రావడం లేదు. పైగా రొటీన్ చిత్రాలు గా తేలిపోతున్నాయి. నితిన్ కెరీర్ మొత్తంలో చేసిన ప్రయోగాలు చాలా తక్కువే. ఈ నేపథ్యంలో లార్డ్ మార్కో లాంటి చిత్రంలో సరైన రోల్ పడితే? కెరీర్ పరంగా కలిసొస్తోంది. ఈ విషయంలో నిర్మాత దిల్ రాజు సహకరించే అవకాశం ఉంది. ఇప్పటికే హనీఫ్ అదేనితో దిల్ రాజు కు కమిట్ మెంట్ ఉన్న సంగతి తెలిసిందే. మార్కో విజయం చూసి అతడితో సినిమా నిర్మించేందుకు అడ్వాన్స్ చెల్లించారు. రాజుగారుకి ఎలాగూ నితిన్ బంధువు. కాబట్టి ఆయన మాటను నితిన్ కాదనలేదు.



రిధి డోగ్రా యొక్క దారుణమైన సోమవారం మూడ్

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com